


అర్జున్ సమాచారం
PRGI NO: TGTEL/25/A5314
www.arjunsamaachaaram.in
తెలుగు దినపత్రిక
ఎడిటర్ : లింగం రాజయ్య
బ్యూరో చీఫ్ : గిరవెన రాకేష్




నల్లగొండ హైదరాబాద్ రంగారెడ్డి | epaper.arjun saamaacharam.com | శనివారం 18, జులై 2026 | సంపుటి :1 సంచిక : 195 | పేజీలు : 8 , వెల.2.00



సీఎంతో వరుస భేటీలు..

## 'మహా'లో ముదురుతున్న రాజకీయం!

నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్‌సీపీ)లో ఉత్కంఠ నెలకొనడంతో మహారాష్ట్ర రాజకీయం మరింత ముదురుతోంది. అధికార కూటమికి చెందిన అజిత్ పవార్ వర్గం ఎన్‌సీపీలో, శరద్ పవార్(ఎస్పీ) నేతృత్వంలోని ఎన్‌సీపీ(ఎస్‌పీ)లో అంతర్గత పరిణామాలు వేగంగా మారుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. సీఎం దేవేంద్ర ఫడణవీస్‌తో జరిగిన వరుస భేటీలు ఆ రాష్ట్ర రాజకీయాల్లో కొత్త ఊహాగానాలకు తెరతీస్తున్నాయి.ఎన్‌సీపీ సీనియర్ నేతలు ప్రఫుల్ పటేల్, సునీల్ తట్కరే ఇటీవల సీఎం ఫడణవీస్‌ను కలవడం కూడా చర్చనీయాంశమైంది.

2



అంతరిక్షంలోకి ప్రధాని

## మోదీ రాసిన పోస్ట్‌కార్డు..

స్కైరూట్ సంస్థ రేపు (శనివారం) 'మిషన్ ఆగమన్' పేరిట 'విక్రమ్–1' రాకెట్‌ను శ్రీహరికోట నుంచి అంతరిక్షంలోకి పంపనుంది. ఈ రాకెట్ సాంకేతిక పరికరాలతో పాటు ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా తన చేతులతో రాసిన ఓ పోస్ట్‌కార్డును కూడా అంతరిక్షంలోకి తీసుకెళ్లనుంది. ప్రధాని మోదీ ఆ పోస్ట్‌కార్డుపై 'వందేమాతరం' అని రాశారు. ఈ రాకెట్‌లో ప్రధాని మోదీ రాసిన పోస్ట్‌కార్డు మాత్రమే కాకుండా.. ఇస్రోకు చెందిన ప్రస్తుత, మాజీ చైర్మన్లు.. భారతీయ వ్యోమగాములు, స్కైరూట్ బృందం, ఇన్వెస్టర్లు, విధాన రూపకర్తలు, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న శ్రేయోభిలాషులు రాసిన వందలాది చేతిరాత పోస్ట్‌కార్డులు కూడా అంతరిక్షంలోకి వెళ్లనున్నాయి.

2



2

చైనా దగ్గర వందల

## సంఖ్యలో స్టెల్త్ యుద్ధ విమానాలు..

భారత్–చైనా సరిహద్దుల్లో ఉద్రిక్తతలు కొనసాగుతున్న తరుణంలో.. రక్షణ రంగంలో భారత్‌ను ఆందోళనకు గురిచేసే ఓ సంచలన నివేదిక వెలుగులోకి వచ్చింది. శత్రుదేశాల రాడార్ల కంటికి చిక్కకుండా దాడులు చేయగల స్టెల్త్ యుద్ధ విమానాల విషయంలో చైనా భారత్ కంటే వందల రెట్లు ముందంజలో ఉందని యూఎస్ డిఫెన్స్ జర్నల్ 'ది వార్ జోన్' వెల్లడించింది.వెటరన్ చైనా మిలటరీ వాచర్ ఆండ్రియాస్ రుప్రెచ్ట్ రాసిన ఆ నివేదిక ప్రకారం.. అత్యంత అధునాతనమైన యుద్ధ విమానాలు 'జీ–20 మైటీ డ్రాగన్' ఉత్పత్తిని చైనా ఊహించని స్థాయిలో పెంచేసింది.

# భారతీయ రైల్వే చరిత్రలో మరో మైలురాయి



- జింద్–సోనిపట్ మధ్య 89 కిలోమీటర్ల మార్గంలో ఈ రైలు
- ఉత్తర రైల్వేలో ప్రయోగాత్మక ప్రాజెక్టు
- హైడ్రోజన్ నిల్వ, ఇంధనం నింపే ప్రత్యేక సదుపాయాలు
- రైల్వే రంగంలో విస్తరించేందుకు ఇది కీలక అడుగు
- రానున్న కాలంలో మరిన్ని మార్గాల్లో ఈ సేవలు
- భారత్‌లో తొలి హైడ్రోజన్ రైలు..
- జెండా ఊపి ప్రారంభించిన ప్రధాని మోదీ

2లో

**భారతీయ రైల్వే చరిత్రలో మరో మైలురాయి చేరింది. దేశంలో హైడ్రోజన్‌తో నడిచే తొలి రైలును ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభిం చారు. హరియాణాలోని జింద్-సోనిపట్ మధ్య 89 కిలోమీటర్ల మార్గంలో ఈ రైలు ప్రయాణించనుంది. ఉత్తర రైల్వేలో ప్రయోగాత్మక ప్రాజెక్టుగా దీనిని ప్రవేశపెట్టారు. దేశ చరిత్రలోనే తొలిసారిగా హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ సాంకేతికతను రైల్వేలో వినియోగిస్తున్నారు.**

హైడ్రోజన్ ద్వారా విద్యుదుత్పత్తి చేసి రైలును నడిపే ఈ సాంకేతికతను డీజిల్ ట్రైన్స్‌కు ప్రత్యామ్నాయంగా తీసుకొచ్చారు. ఈ ప్రాజెక్ట్‌లో హైడ్రోజన్ నిల్వ, ఇంధనం నింపే ప్రత్యేక సదుపాయాలనూ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. 'హైడ్రోజన్ రైలు సేవలను ప్రారంభించిన దేశాల జాబితాలో భారత్ చేరడం గర్వకారణం. స్వచ్ఛమైన, సుస్థిర సాంకేతికతను రైల్వే రంగంలో విస్తరించేందుకు ఇది కీలక అడుగుగా నిలుస్తుంది' అని పేర్కొన్నారు.





## ఉద్యోగులు, పెన్షనర్లకు గుడ్ న్యూస్.. నగదు రహిత వైద్య సేవలు ప్రారంభం..



వార్త 2లో

తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న నగదు రహిత వైద్య సేవల పథకాన్ని ప్రారంభించింది. దీనిని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పోర్టల్, డిజిటల్ హెల్త్ కార్డులను ప్రారంభించారు. అలాగే ట్రస్ట్ డీడ్‌ను మంత్రులు ఆవిష్కరించారు. ఈ పథకం ద్వారా మొత్తం 17.88 లక్షల మందికి ఆరోగ్య భద్రత లభించనుంది.




2

దారుణం..

## బాలికకు మాయ మాటలు చెప్పి అత్యాచారం.. ఇద్దరిపై పోక్సో కేసు..

బ్యాంకింగ్ వ్యవస్థలో

## సమూల మార్పులు తీసుకొచ్చాం



2

భారీ ఉగ్ర కుట్ర భగ్నం.. ఐదుగురు

## ఉగ్రవాదుల అరెస్ట్

ఉగ్రవాద అణచివేత చర్యల్లో భాగంగా గుజరాత్ పోలీసులు జైషే మహమ్మద్ టెర్రర్ మాడ్యూల్‌ను ఛేదించారు. పాకిస్థాన్ కేంద్రంగా నడుస్తోన్న ఈ ఉగ్రముఠాతో సంబంధం ఉన్న ఐదుగురిని అరెస్ట్ చేశారు. బిలాల్ అభిద్ షేరా, మహమ్మద్ అయూబ్ కడివాల్, మహమ్మద్ షఫీ ముఖి, మహమ్మద్ హసన్ కరాడియా, మహమ్మద్ సునాసరగా వారిని గుర్తించారు. న్యాయస్థానం వీరికి జులై 24 వరకు పోలీసు కస్టడీ విధించింది. ఇటీవల ఎనిమిది మంది జైషే అనుమానితులను గుజరాత్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో అరెస్ట్ చేశారు. దేశంలో ఉగ్రకార్యకలాపాలు నిర్వహించేందుకు ఒక నెట్‌వర్క్ కోసం వారు యత్నిస్తున్నట్లు తెలిసింది. వారిని విచారిస్తున్నప్పుడే ఈ ఐదుగురి పేర్లు బయటకు వచ్చాయి.

## కీసరలో ఓఆర్ఆర్ పై రోడ్డు ప్రమాదం: ఇద్దరు మృతి

కీసర:

మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కీసర వద్ద ఓఆర్ఆర్ పై రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగినట్టు తెలుస్తోంది. మృతదేహాలను శవ పరీక్ష నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతులు వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సమాచారం. వాహనం పైనుంచి వెళ్లడంతో మృతదేహాలు నుజ్జునుజ్జుగా మారాయి.

# భవిష్యత్తులో వీజీఎఫ్ విప్లవం

## పీపీపీ ప్రాజెక్టులతోనే వేగంగా అభివృద్ధి

### పతీ ప్రభుత్వ శాఖకూ ఓ ఫైనాన్షియల్ ప్లాన్

### నిరర్ధకంగా ఉన్న ప్రభుత్వ ఆస్తుల సద్వినియోగం

### మెడికల్ కాలేజీల నిర్మాణంలో పీపీపీ విధానంపై కేంద్రం ప్రశంసలు

### పీపీపీ-వీజీఎఫ్ పాలసీ 1.0 మార్గదర్శకాలు త్వరలో విడుదల

### పీపీపీ ప్రాజెక్టులు, పీపీపీ విధానంపై సీఎం చంద్రబాబు సమీక్ష

**అమరావతి,**

భవిష్యత్తులో వయబిలిటీ గ్యాప్ ఫండింగ్‌తో కూడిన ప్రాజెక్టులే కీలకంగా మారనున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. గతంలో ఆర్థిక సంస్కరణలు, ప్రస్తుతం మౌలిక సదుపాయాల విప్లవం దేశంలో నడుస్తోందని అన్నారు. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతోనే వివిధ రంగాల్లో ప్రాజెక్టులు చేపట్టి వేగంగా అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉంటుందని సీఎం అన్నారు. రాష్ట్రంలో పీపీపీ కింద చేపట్టిన ప్రాజెక్టులు, ప్రభుత్వం చేస్తున్న వ్యయం తదితర అంశాలపై గురువారం ముఖ్యమంత్రి అధికారులతో సమీక్షించారు. ప్రస్తుతం పోర్టులు, షిప్ యార్డులు, ఎయిర్ పోర్టులు, పర్యాటక ప్రాజెక్టులు సహా మొత్తం 260 ప్రాజెక్టులను పీపీపీ కింద చేపట్టినట్టు ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. పరిశ్రమలు, మౌలికసదుపాయాలు, పురపాలక, టూరిజం, వైద్య కళాశాలలు, రహదారులు, సౌర విద్యుత్ లాంటి రంగాల్లో రూ.1,23,229 కోట్ల విలువైన ప్రాజెక్టులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం అన్ని పీపీపీ ప్రాజెక్టులనూ సస్టెయినబుల్ మోడల్‌లో అభివృద్ధి చేయాలని... ప్రతీ ప్రాజెక్టు వద్దా ఆర్థిక కార్యకలాపాలకు అవకాశం ఉండేలా చూడాలని స్పష్టం చేశారు. వివిధ ప్రాజెక్టులకు కేంద్రం ఇచ్చే అర్బన్ ఛాలెంజ్ ఫండ్ లాంటి వాటిని కూడా సమర్ధంగా వినియోగించుకోవాలని అన్నారు. పోర్టులు, ఎయిర్ పోర్టులు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను సమర్ధంగా నడిపేందుకు అవసరమైన మెకానిజమ్ సిద్ధం చేయాలని సూచించారు. కోస్టల్ టూరిజం ప్రాజెక్టుల్లో స్థానిక మత్స్యకారులను కూడా భాగస్వాములను చేసి వారికి ప్రయోజనాలు కలిగేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని 21 ప్రధాన దేవాలయాల వద్ద పబ్లిక్ టచ్ పాయింట్ల వద్ద మెరుగైన మౌలిక సదుపాయాలు, ఆర్థిక కార్యకలాపాలకు అవకాశాలు కల్పించాలన్నారు. విజయవాడ, తిరుపతిలోని వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్లకు రూ.178 కోట్ల వీజీఎఫ్‌ను కేంద్రం ఇస్తోందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మెడికల్ కాలేజీలకు రూ.1,468 కోట్ల వీజీఎఫ్ రానుందని.. ఈ ప్రాజెక్టులు చేపట్టిన విధానంపై కేంద్ర ఆర్థిక

చేసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికల ద్వారా ఆదాయ మార్గాలను నిర్దేశించుకోవాలన్నారు. ప్రభుత్వ శాఖలు పెట్టుబడిదారుల నుంచి విశ్వాసాన్ని కలిగించేలా పీపీపీ ప్రాజెక్టులను చేపట్టాలని సీఎం సూచించారు. ఏ రంగమైనా ఏపీకి ఫస్ట్ మూవర్ అడ్వాంటేజి రావాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ ఆస్తుల సద్వినియోగంప్రభుత్వం వద్ద నిరర్ధకంగా ఉన్న ఆస్తులను అవకాశాలుగా మలచుకోవాలని సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలోని అన్ని బస్టాండ్ల వద్ద ప్రభుత్వానికి ఉన్న భూములను వాణిజ్య పరంగా వినియోగించుకునే అవకాశాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రి



వ్యవహారాల విభాగం ప్రశంసించిందని అధికారులు తెలిపారు. వచ్చే కేబినెట్‌కు నూతన విధానంఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం-వీజీఎఫ్ పాలసీ 1.0 ను వచ్చే కేబినెట్ సమావేశంలో చర్చకు పెట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. దీనికి సంబంధించి త్వరలోనే మార్గదర్శకాలు విడుదల చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వేర్వేరు విధానాలను కూడా అధ్యయనం చేయాల్సిందిగా సూచించారు. 2047 స్వర్ణాంధ్ర లక్ష్యాల మేరకు ప్రతీ ఏటా పీపీపీ కింద రూ.8 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని అధికారులు అంచనా వేశారు. రాష్ట్రంలోని విశాఖ, అమరావతి, తిరుపతి ఎకనామిక్ రీజియన్లలో పెద్దఎత్తున మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల కింద వీటిని చేపట్టాల్సి రావొచ్చని సీఎంకు వివరించారు. దీనిపై స్పందించిన సీఎం స్వర్ణాంధ్ర విజన్ మైక్రో, మ్యాక్రో లక్ష్యాలకు అనుగుణంగా ప్రాజెక్టులు చేపట్టాలని అన్నారు. ఎప్పటికప్పుడు లోటుపాట్లను సరిదిద్దుకుంటూ అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. భవిష్యత్తులో పరిశ్రమలకు సరఫరా చేసే నీటి ద్వారా జలవనరుల శాఖకు ఆదాయం వస్తుందని... సాగునీటి సంఘాలు కూడా ఈ ప్రక్రియలో కీలకంగా ఉంటాయన్నారు. ప్రతీ ప్రభుత్వ శాఖ ఫైనాన్షియల్ ప్లాన్ ను తయారు స్పష్టం చేశారు. పంప్డ్ స్టోరేజీ, సౌరవిద్యుత్ ప్రాజెక్టులు కూడా పీపీపీ కింద చేపట్టేందుకు చర్యలు చేపట్టాలన్నారు. గనులు, నెడ్ క్యాప్, పర్యాటకం, లాజిస్టిక్స్ రంగాల్లో భారీగా ఆదాయాన్ని ఆర్జించే అవకాశం ఉందని సీఎం అన్నారు. రాష్ట్రంలోని ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనారిటీ రెసిడెన్షియల్ హాస్టళ్లలో ఉన్న విద్యార్థుల సంఖ్యను రెట్టింపు చేసేందుకు ఆలోచన చేస్తున్నామని.. పట్టణ ప్రాంతాల్లో రహదారులకు సమీపంలోనే మినీ టౌన్‌షిప్‌లా రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేసేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సీఎం సూచించారు. బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులను నైపుణ్యం ఉన్న మానవ వనరులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ఆలోచన చేస్తోందని సీఎం స్పష్టం చేశారు. ఐఐటీ, ఐఐఎం లాంటి ప్రతిష్టాత్మక విద్యా సంస్థల్లోనూ చదివేలా వీరిని తీర్చి దిద్దాలని అన్నారు. ఈ సమీక్షకు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఆ శాఖ ఉన్నతాధికారులు పీయూష్ కుమార్, వి.వినయ్ చంద్, రోనాల్డ్ రోస్, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్ కుమార్, ఐఅండ్ ఐ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు తదితరులు హాజరయ్యారు.

# ఎడ్యుకేషన్ జిహాద్ పై బిజెపి ఆగ్రహం

## సైదాబాద్ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపించాలి

## బిజెపి అధ్యక్షుడు రాంచంద్రరావు డిమాండ్

**హైదరాబాద్,**

:'ఎడ్యుకేషన్ జిహాద్' ఉదంతాన్ని బీజేపీ తీవ్రంగా ఖండిస్తోందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు మరోసారి స్పష్టం చేశారు. ఘటనపై కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే నిష్పాక్షికమైన, సమగ్రమైన దర్యాప్తు జరపాలన్నారు. పాఠశాల యాజమాన్యంతో పాటు కారకులైన ప్రతి ఒక్కరిపైనా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అవసరమైతే ఆ స్కూల్ గుర్తింపును రద్దు చేయాలని రాంచందర్ రావు పేర్కొన్నారు. సైదాబాద్‌లోని సక్సెస్ స్కూల్ ఘటనపై బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనలో 'ఎడ్యుకేషన్ జిహాద్' తారాస్థాయికి చేరిందంటూ ఆయన మండిపడ్డారు. ఇందుకు పాతబస్తీ సైదాబాద్‌లోని సక్సెస్ స్కూల్ ఘటనే ప్రత్యక్ష నిదర్శనమని పేర్కొన్నారు. ఆ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న హిందూ విద్యార్థికి కల్మా, సూరా అల్-ఫాతిహాలను చదివి రావాలని హోమ్‌వర్క్‌గా ఇవ్వడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దుశ్చర్యకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే పూర్తి బాధ్యత వహించాలని రాంచందర్ రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా 'కాంగ్రెస్ అంటే ముస్లింలు.. ముస్లింలు అంటే కాంగ్రెస్' అని, రేవంత్ చేసిన ఓటు బ్యాంకు, ముస్లిం సంతుష్టీకరణ రాజకీయాల వల్లే ఇలాంటి తీవ్రవాద ఆలోచనలు ఉన్న శక్తులకు తెగింపు పెరిగిందని రాంచందర్ రావు మండిపడ్డారు. తమ బిడ్డ చేత బలవంతంగా కల్మా రాయించడాన్ని గమనించి, పాఠశాల యాజమాన్యాన్ని ధైర్యంగా నిలదీసిన ఆ చిన్నారి తల్లి సాహసాన్ని తాను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని రాంచందర్ రావు పేర్కొన్నారు. ఇంతటి తీవ్రమైన ఉదంతం వెలుగులోకి వచ్చినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ సదరు పాఠశాల యాజమాన్యంపై ఇప్పటివరకు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గమన్నారు. కేవలం ఒక ముస్లిం టీచర్‌ను బాధ్యతల నుంచి తప్పిస్తే సరిపోదని, ఈ ఘటనకు పూర్తి బాధ్యత స్కూల్ మేనేజ్‌మెంట్‌దేనని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ పాలనలో హిందువుల పరిస్థితి ఎంత దయనీయంగా మారిందో చెప్పడానికి ఈ ఘటనే ఉదాహరణ అని రాంచందర్ రావు పేర్కొన్నారు. హిందూ విద్యార్థులు, వారి కుటుంబాల భద్రత, ఆత్మగౌరవం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా కళ్లు మూసుకుని వ్యవహరిస్తోందని మండిపడ్డారు. హిందూ విద్యార్థులపై వారి మతానికి సంబంధం లేని ప్రార్థనలు, కల్మాలు బలవంతంగా రుద్దడం ఏమాత్రం సహించబోమన్నారు. కొన్ని కాన్వెంట్ స్కూళ్లలో హిందూ విద్యార్థులు బొట్టు పెట్టుకుని రాకూడదని ఒత్తిడి చేస్తూ మతాచారాలకు దూరం చేసే కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. విద్యా సంస్థలు విద్యను అందించాలే తప్ప, విద్యార్థులపై ఏ మతాన్నీ రుద్దే హక్కు ఎవరికీ లేదన్నారు. ప్రతి విద్యార్థి రాజ్యాంగ హక్కులను గౌరవించాల్సిన బాధ్యత అన్ని పాఠశాలలపై ఉందన్నారు.

# గొల్లప్రోలు, మూలపేట ఘటనలపై పవన్ సీరియస్

## సమగ్ర దర్యాప్తు జరిపి చట్టప్రకారం చర్యలు తీసుకోండి

## కాకినాడ జిల్లా పోలీసులకు డిప్యూటి సిఎం పవన్ ఆదేశం

**అమరావతి**

కాకినాడ జిల్లాలోని గొల్లప్రోలు, యు.కొత్తపల్లి మండలం మూలపేట ప్రాంతాల్లో జరిగిన ఘటనలపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. మద్యం మత్తులో, క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలు కుటుంబాలను ఛిన్నాభిన్నం చేయడమే కాకుండా, సంబంధిత వ్యక్తుల భవిష్యత్తును కూడా అంధకారంలోకి నెడతాయని పేర్కొన్నారు. గొల్లప్రోలు, యు.కొత్తపల్లి మండలం మూలపేట ప్రాంతాల్లో చోటుచేసుకున్న సంఘటనలే ఇందుకు నిదర్శనమని చెప్పుకొచ్చారు. ఈ రెండు ఘటనలపై కాకినాడ జిల్లా పోలీసులు సమగ్ర దర్యాప్తు నిర్వహించి, బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా సున్నితమైన ప్రాంతాలు గుర్తించి అవగాహన సదస్సులు నిర్వహించాలని పవన్ కల్యాణ్ సూచించారు. కాగా, కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం మూలపేటలో ఓ వ్యక్తితో కొంతమంది యువకులకు గొడవ జరిగింది. ఈ ఘటనలో పెదపూడి మండలం రామేశ్వరానికి చెందిన రాకేశ్ (25) అనే యువకుడు మృతిచెందాడు. తన అమ్మమ్మ వేమగిరి రమణమ్మ అంత్యక్రియల్లో పాల్గొనేందుకు బుధవారం మూలపేటకు రాకేశ్ వచ్చాడు. ఈ సందర్భంగా రాకేశ్ చెల్లి గ్రామంలోని ఓ దుకాణం వద్దకు వెళ్లగా, స్థానికంగా ఉన్న ఐదుగురు యువకులు ఆమెతో అసభ్యంగా ప్రవర్తిస్తూ వేధించారు. ఈ క్రమంలో తన అన్న రాకేశ్.. ఐదుగురు యువకులను మందలించాడు. వీరిలో వంశీ అనే యువకుడు కోపంతో రాకేశ్‌ను చాకుతో పొడవడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. గొల్లప్రోలు నగర పంచాయతీ రెండో వార్డు మాజీ కౌన్సిలర్ సంధ్య భర్త లింగం అర్జునుడు, తన స్నేహితులతో కలిసి దారపల్లి వాటర్ ఫాల్స్‌కు వెళ్లాడు. అదే సమయంలో అక్కడికి వచ్చిన స్థానికుడు బచ్చల మారుతి పవన్ కల్యాణ్ అనే వ్యక్తితో అర్జునుడికి ఓ విషయంలో గొడవ జరిగింది. ఈక్రమంలో మాటామాటా పెరిగి తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలోనే అర్జునుడి కడుపులో బచ్చల మారుతి పవన్ కల్యాణ్ బలంగా పొడిచాడు. కత్తిపోట్లకు గురైన అర్జునుడిని పిఠాపురంలోని కార్తికేయ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అర్జునుడు ఆస్పత్రిలోనే మృతిచెందాడు. ఈ రెండు ఘటనలపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. పోలీసులు సమగ్ర దర్యాప్తు జరపాలని పవన్ కల్యాణ్ ఆదేశించారు.

# మమతా బెనర్జీకి వరు షాక్‌లు

## టిఎంసికి, రాజ్యసభకు రుక్మిణి మల్లిక్ రాజీనామా

## ఛైర్మన్ రాధకృష్ణకు రాజీనామా అందచేత

**కోల్‌కతా,**

తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు మమతా బెనర్జీకి వరుస షాక్‌లు తగులూతనే ఉన్నాయి. ఆ పార్టీకి చెందిన రాజ్యసభ ఎంపీ రుక్మిణి మల్లిక్ (కోయెల్ మల్లిక్) షాక్ ఇచ్చారు. టీఎంసీకి, రాజ్యసభ సభ్యత్వానికి రుక్మిణి మల్లిక్ గురువారం రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను ఉపరాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్‌కు ఆమె సమర్పించారు. దీంతో రాజ్యసభ నుంచి వైదొలిగిన నాలుగో టీఎంసీ ఎంపీగా రుక్మిణి నిలిచారు. ఇప్పటికే ఆ పార్టీ నుంచి సుఖేందు శేఖర్ రాయ్, ప్రకాశ్ చిక్ బరైక్, సుష్మితా దేబ్ తమతమ రాజ్యసభ ఎంపీ పదవులకు రాజీనామా చేశారు. ఈ ఏడాది ఆరంభంలోనే రాజ్యసభకు రుక్మిణి మల్లిక్ ఎన్నికయ్యారు. టీఎంసీ 2026 ఫిబ్రవరి 27న రాజ్యసభ ఎన్నికలకు ఆమె అభ్యర్థిత్వాన్ని ప్రకటించింది. దీంతో ఏకగ్రీవంగా ఎన్నికై ఏప్రిల్ 6న రాజ్యసభ ఎంపీగా రుక్మిణి ప్రమాణ స్వీకారం చేశారు. ఎన్నికైన వెంటనే టీఎంసీ, మమతా బెనర్జీకి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. బెంగాల్ ప్రజలకు సేవ చేసే అవకాశం లభించడం ఎంతో గౌరవంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇది ఓ కొత్త ప్రయాణానికి ఆరంభమని, ఉత్తమంగా పని చేసేందుకు ప్రయత్నిస్తానని రుక్మిణి చెప్పుకొచ్చారు. అయితే ఎంపీగా ఎన్నికై నాలుగు నెలలు గడవక ముందే తన పదవికి ఆమె రాజీనామా చేయడం సంచలనంగా మారింది. కాగా, రుక్మిణి మల్లిక్ రాజీనామాపై టీఎంసీ, మమతా బెనర్జీ ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటనా చేయలేదు. రుక్మిణి మల్లిక్.. కోయెల్ మల్లిక్ పేరుతో బెంగాలీ చిత్ర పరిశ్రమలో అగ్రశ్రేణి నటి. టాలీ-క్వీన్‌గా ప్రసిద్ధి చెందిన రుక్మిణి రెండు దశాబ్దాలకు పైగా నటించి మంచి పేరు తెచ్చుకున్నారు. 'నాటర్ గురు', 'శుభోదృష్టి', 'మోన్ మానే నా', 'ప్రేమేర్ కహానీ', '100? లవ్', 'రంగబాజ్' వంటి వరుస హిట్ చిత్రాల్లో ఆమె నటించి మెప్పించారు. రుక్మిణి నటనకు గానూ ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ బంగ్లా, రెండు బీఎఫ్‌జేఏ అవార్డులు, ఆనందలోక్ పురస్కార్ వంటి అనేక గౌరవాలను అందుకున్నారు. 2023లో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఆమెకు మహానాయక్ సమ్మాన్‌ను కూడా ప్రదానం చేసింది. అనంతరం టీఎంసీ పార్టీ ఆమెను రాజ్యసభకు నామినేట్ చేసింది.

# పోలవరం ప్రాజెక్టు పనులను పరిశీలించిన బిజెపి ప్రజాప్రతినిధుల బృందం

**ఏలూరు,**

పోలవరం ప్రాజెక్టు పనుల తీరును గురువారం బిజేపీ ప్రతినిధుల బృందం పరిశీలించింది. తొలుత పోలవరం ప్రాజెక్టు సైటుకు చేరుకున్న కేంద్ర ఉక్కు,భారీ పరిశ్రమలు శాఖా సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్, రాష్ట్ర బిజెపి అధ్యక్షులు పి.వి.యన్. మాధవ్, రాజమండ్రి పార్లమెంటు సభ్యులు దగ్గుబాటి పురందేశ్వరి, శాసన మండలి సభ్యులు సోము వీర్రాజు, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, అదోని ఎమ్మెల్యే డా.పి.వి. పార్థసారథి, ఎచ్చెర్ల ఎమ్మెల్యే యన్.ఈశ్వర రావు, విశాఖపట్నం ఎమ్మెల్యే వి.విష్ణుకుమార్ రాజు, ఇరవై సూత్రాల కార్యక్రమం ( వికసిత్ భారత్- స్వర్ణ ఆంధ్ర ప్రదేశ్) అమలు చైర్మన్ లంకా దినకర్, ఏపి ఎస్టీ కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జిరెడ్డి, తెలుగుభాషా అకాడమీ చైర్మన్ రాయపాటి డేవిడ్ విల్సన్ లు కలిసి పోలవరం ప్రాజెక్టు పనులు ప్రగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంతృప్తిని వ్యక్తం చేశారు. ముందుగా ప్రాజెక్టు వ్యూపాయింటు నుండి ప్రాజెక్టు పనులు ప్రగతిని ఇంజనీరింగు బృందం వివరించారు. అనంతరం పవర్ హౌసు, అండర్- స్కియరు కాఫరు డ్యామ్ నుండి గ్యాప్-1 గ్యాప్ -11, స్పిల్ వే, తదితర ప్రాజెక్టు పనులను పరిశీలించారు. ఆయా ప్రాంతాలలో ఇంజనీరింగు అధికారులు ప్రాజెక్టు పనులు పురోగతిపై ఏర్పాటుచేసిన ఫోటో ఎగ్జిబిషన్లు ద్వారా వివరించారు. పర్యటన ఆద్యంతం పనులు పురోగతికి ఇంజనీరింగు అధికారులను అడిగి తెలుసుకుంటూ, త్వరితగతిన పూర్తిచేసేందుకు అన్ని చర్యలను తీసుకుని నిర్ణీత సమయానికి పూర్తి చెయ్యాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింటు కలెక్టరు యం.జె.అభిషేక్ గౌడ, పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటరు ఎక్స్ అఫీషియో జాయింటు కలెక్టరు వి.అభిషేక్, రంపచోడవరం ఐటిడిఏ పీవో యస్.ప్రశాంత్ కుమార్, ఇంజనీరు ఇన్ చీఫ్ కె.నరసింహామూర్తి, పోలవరం ఇరిగేషన్ యస్ఇ ఆర్.రామచంద్రరావు, రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షులు బొల్లిన నిర్మల కిషోర్, గారపాటి సీతారామాంజనేయ చౌదరి, జిల్లా బిజెపి అధ్యక్షులు సి.హెచ్. విక్రమ్ కిషోర్, మెగా ప్రతినిధులు, ఇంజనీరింగు బృందం, అధికారులు, బిజెపి నాయకులు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# చట్టవిరుద్ధంగా పోడు చేస్తే చర్యలు తప్పవు

**భద్రాద్రి కొత్తగూడెం**

అటవీ హక్కుల చట్టం ప్రకారం చెల్లుబాటయ్యే అటవీ హక్కు పత్రాలు లేకుండా భూముల్లో పోడు సాగు చేయవద్దని, దుక్కులు దున్ని పంటలు వేయొద్దని ముసలిమడుగు సెక్షన్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ అనార్కలి అన్నారు. బుధవారం బూర్గంపహాడ్ మండల పరిధిలోని బుడ్డగూడెం గ్రామంలోని ఆదివాసీలకు అటవీ సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణ, పోడు సాగుపై జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. చట్ట విరుద్ధంగా అడవులను నరికి ప్రభుత్వ ప్లాంటేషన్లు ధ్వంసం చేసి పోడు సాగు చేస్తే అటవీ చట్టాలు, ఇతర సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొత్తగా అడవులను ఆక్రమించి పోడు భూములు సృష్టించవద్దని, అడవులకు నిప్పు పెట్టకూడదని, వన్యప్రాణులను వేటాడరాదని, అటవీ సంపదను భావితరాలకు పరిరక్షించడం ప్రతిఒక్కరి బాధ్యత అని వివరించారు. అటవీ పరిరక్షణలో గ్రామస్తులు అటవీశాఖ సిబ్బందికి సహకరించాలని, ఎలాంటి అక్రమాలు అడవుల్లో జరిగినా అటవీ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ సదస్సులో సోంపల్లి మాజీ సర్పంచ్ తాటి వీరాంజనేయులు, కార్యదర్శి వెంకటేశ్వర్లు, బీట్ ఆఫీసర్లు సోడె శ్రీరాములు, మడకం వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి జలాలల వృధాను అరికట్టరెందుకు

## మోటర్లు ఆన్ చేస్తే నీటిని సద్వినియోగం చేసుకోవచ్చు

## ప్రభుత్వ తీరుపై ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు విమర్శలు

**ఖమ్మం,**

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని, తెలంగాణ ప్రయోజనాలను పక్కనపెట్టి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆంధ్రాకు తొత్తుగా వ్యవహరిస్తున్నారని ఉమ్మడి ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ పార్టీ ఇన్‌ఛార్జ్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన 'సర్' ప్రత్యేక ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ కార్యక్రమంలో భాగంగా బుధవారం జూలూరుపాడు మండల కేంద్రంలోని ఏవీఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన బీఆర్ఎస్ పార్టీ బిఎల్ఏల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన పార్టీ శ్రేణులకు దిశానిర్దేశర చేయడంతో పాటు ప్రభుత్వ వైఫల్యాలను తీవ్రంగా ఎండగట్టారు. గోదావరి జలాలు వృథాగా సముద్రం పాలవుతున్నా రాష్ట్ర ప్రభుత్వం మోటార్లు ఆన్ చేయడం లేదని ఆయన ఆరోపించారు. కన్నెపల్లి, దేవాదుల పంప్ హౌస్ లలో నీటిమట్టం పుష్కలంగా ఉన్నప్పటికీ పంపింగ్ చేయడం లేదన్నారు. కానీ, ఆంధ్రా బోర్డర్ కు నీళ్లు ఇచ్చేందుకు మాత్రం జూలూరుపాడు నుంచి ఏన్కూర్ మండలంలోని సాగర్ కాల్వ వరకు కాలువ తవ్వి సత్తుపల్లి వైపు నీటిని తరలించేందుకు ఆగమేఘాల మీద కాలువలు తవ్వుతున్నారని మండిపడ్డారు. తెలంగాణను సస్యశ్యామలం చేసేందుకు మాజీ సీఎం కేసీఆర్ కాళేశ్వరం, సీతారామ లాంటి ప్రాజెక్టులను నిర్మిస్తే.. కక్ష సాధింపు చర్యల్లో భాగంగా ప్రస్తుత ప్రభుత్వం వాటిని ఉద్దేశపూర్వకంగా నిరుపయోగంగా మారుస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజుల హామీలను గాలికొదిలేసిందని, నిధులు లేవని సాకులు చెబుతూ కాలయాపన చేస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులతో కరువు ఛాయలు అలుముకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని, సలహాలు ఇస్తే స్వీకరించకపోగా పచ్చి బూతులు మాట్లాడుతూ బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు సాగు కోసం నానా అవస్థలు పడుతున్నారని, కనీసం యూరియా కూడా దొరకని పరిస్థితి దాపురించిందన్నారు. పండించిన ధాన్యం కొనుగోలు చేయకుండా రైతుల కళ్లల్లో మట్టి కొడుతున్న ఈ దుర్మార్గపు పాలనపై ప్రజలు, రైతులు ఏకమై నిలదీయాలని పిలుపునిచ్చారు. మండల వ్యాప్తంగా వంద శాతం ఓట్ల నమోదు ప్రక్రియను విజయవంతం చేయడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు కదలాలని ఎమ్మెల్సీ పిలుపునిచ్చారు. పార్టీకి మూలస్తంభాలైన బీఎల్ఏలు రాబోయే వారం రోజుల పాటు సైనికుల్లా శ్రమించాలన్నారు. ప్రతి బిఎల్ఏ స్వయంగా గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి, అర్హులైన వారందరితో ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తి చేయించి, వాటిని బూత్ లెవెల్ అధికారులకు అందజేసే బాధ్యతను తీసుకోవాలని సూచించారు. ఒకవేళ ఎవరికైనా ఫారాలు అందకపోతే వెంటనే సంబంధిత బీఎల్ఓలను సంప్రదించి సకాలంలో సమర్పించేలా చొరవ చూపాలని స్పష్టం చేశారు. అప్పటికే ఖమ్మం జిల్లాలో 65 నుంచి 75 శాతం ఓట్ల నమోదు పక్రియ పూర్తయిందని, మిగిలిన పనిని ఈ నెల 24వ తేదీలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు మండల స్థాయి ప్రజాప్రతినిధులు, బూత్ లెవెల్ ఏజెంట్లు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

PRGI NO: TGTEL/25/A5314

అర్జున్ సమాచారం

www.arjunsamaachaaram.in

తెలుగు దినపత్రిక

ఎడిటర్ : లింగం రాజయ్య

బ్యూరో చీఫ్ : గిరవెన రాకేష్

## సంపాదకీయం...

# పంజాబ్‌లో రగులుతున్న రాజకీయం

దృఢమైన 'సామాజిక సంకీర్ణం' (సోషల్ కోయలీషన్) మద్దతు అనుభవిస్తున్న పార్టీ 'ఆప్' భౌగోళికంగా కూడా పంజాబ్ రాష్ట్రమంతటా విస్తరించి ఉంది. రాష్ట్రంలో ఇప్పుడు నెలకొని ఉన్న రాజకీయ వాతావరణాన్ని సానుకూలంగా మలచుకొని తిరిగి అధికారం నిలబెట్టుకునే మిషన్‌లో అది నిమగ్నమైంది. జాతీయ రాజకీయాల్లో విపక్ష 'ఇండియా కూటమి'లో తనకు సహచరపక్షమైన కాంగ్రెస్ ఇక్కడ ఆప్‌కు ప్రధాన ప్రత్యర్థి! ప్రభుత్వ వ్యతిరేకతను సొమ్ము చేసుకోగలిగే సంస్థాగత వ్యవస్థ రాష్ట్రమంతా విస్తరించి ఉన్న కాంగ్రెస్ పార్టీ అంతర్గత కుమ్ములాటల్లో పీకల్లోతుకు కూరుకుపోయి ఉంది. వాటి నుంచి బయటపడి, ఐక్యత సాధించి, ఎన్నికల నాటికి ఆప్‌ను ఢీకొట్టి ఆధిక్యత సాధించగలిగేనా? అన్న సందేహాలున్నాయి. ఇతర ముఖ్య పార్టీలయిన శిరోమణి అకాలీదళ్, బిజెపిలకు ఆ స్థాయి లేదు. సంప్రదాయక సిక్ ఓటర్లలో ప్రాబల్యం ఉన్న అకాలీదళ్ 2012 తర్వాత క్రమంగా బలహీనపడుతూ వస్తోంది. ఇదీ పంజాబ్‌లో ఇప్పుడున్న రాజకీయ పరిస్థితి! మజ్హ, దోబ, మాల్వ మూడు ప్రధాన ప్రాంతాలుగా విడిపోయి ఉన్న పంజాబ్‌లో ఒక్కో ప్రాంతంలో ఒక్కో రాజకీయ ప్రాబల్యం, ఆధిపత్యపు హెచ్చుతగ్గులు విస్పష్టంగా కనిపిస్తాయి. ఇటీవలి పరిణామాల్లో.. యువ నాయకుడు రాఘవ్ చద్దాతో పాటు మొత్తం ఏడుగురు ఆప్ రాజ్యసభ సభ్యులు పార్టీ మారి బిజెపిలో చేరడం ఆప్‌కు పెద్ద దెబ్బే! పెద్దల సభలో పార్టీ బలం పది నుంచి మూడుకు పడిపోవడమే కాకుండా పంజాబ్‌లో అసెంబ్లీ ఎన్నికల ముందు సంస్థాగతంగా పార్టీని బలహీనపరిచే పరిణామమే! కానీ, అది తమకు అదనపు నైతిక స్థయిర్యాన్ని ఇచ్చిందని పార్టీ చెప్పుకుంటోంది. ఏ రకంగా చూసినా ఈ ఎన్నికలు అటు ఆప్‌కు, ఇటు కాంగ్రెస్, బిజెపిలకు ముఖ్యమైనవే! ఎన్నికలకు ఆరేడు మాసాల ముందర పంజాబ్‌లో ఎవరి పరిస్థితి ఏమిటి? సింహావలోకనమే ప్రస్తుత విశ్లేషణ. ౘాశ్రీంశీ =ఘుం – చిన్న ఉద్యోగాలకు నైపుణ్యమే దన్ను పంజాబ్‌లో కాంగ్రెస్– అకాలీదళ్ ముఖాముఖి రాజకీయాల శకం ముగియడమే కాకుండా గత దశాబ్ద కాలంలో కొత్త రాజకీయ చిత్రం ఆవిష్కృతమైంది. పుట్టినిల్లు ఢిల్లీలో కన్నా మెట్టినిల్లు పంజాబ్‌లోనే ఆప్ సామాజికంగా, సంస్థాగతంగా బలోపేతమై ఉంది. 117 సభ్యుల అసెంబ్లీలో 94 మంది బలంతో 2022 నుంచి ఆప్ అధికారంలో ఉంది. వీరి బలం.. మధ్య –దక్షిణ మాల్వాలో బలంగా ఉండడంతోపాటు దాదాపు అన్ని ప్రాంతాల్లోనూ విస్తరించి ఉండటం. యువ– మొదటిసారి ఓటర్లవుతున్న వారు దన్నుగా ఉండం, రైతులు, దిగువ మధ్యతరగతి ప్రజానీకం, దళిత వర్గాల మద్దతు పుష్కలంగా లభించడం ఆప్‌కు అనుకూలించనుంది. కేంద్రంలోని బిజెపి నేతృత్వపు ఎన్‌డిఎ ప్రభుత్వానికి స్థిరమైన ప్రత్యర్థిగా ఉండటం, రాష్ట్రంలోని పలు నియోజకవర్గాల్లో జరిగే బహుముఖ పోటీల్లో ఆధిపత్య పార్టీగా నిలిచే అవకాశం ఆప్ పరిస్థితిని స్థూలంగా మెరుగుపరుస్తోంది. బలహీనతలు – ప్రభుత్వ వ్యతిరేకత, పలు చోట్ల సర్కారు పనితీరుతో పాటు అధికారుల వ్యవహారశైలి ప్రతికూల భావనల్ని రేపడం. ఇప్పటికీ ఇంకా కొన్ని నియోజకవర్గాల్లో బూత్ స్థాయి కమిటీల ఏర్పాట్లలోనే ఉండటం వంటివి ప్రతికూలాంశాలుగా ఉన్నాయి. వచ్చే ఎన్నికల్లో 55 స్థానాల్లో బలమైన శక్తిగాను, 15 చోట్ల గట్టి పోటీదారుగాను 'ఆప్' నిలువనుంది. 8 నుంచి 10 స్థానాల్లో బలహీనంగా కనిపిస్తోంది. కాంగ్రెస్ పార్టీకి పంజాబ్ రాష్ట్రవ్యాప్తంగా సంస్థాగత నిర్మాణం ఉంది. అదిప్పుడు ప్రతిపక్ష హోదాలో పనిచేస్తోంది. అంతర్గత కుమ్ములాటలు పార్టీని వేధిస్తున్నాయి. పార్టీలో ఐక్యత లోపించి, సరైన దిశానిర్దేశ్యం లేక బలహీనపడిందే తప్ప పార్టీ కనుమరుగు కాలేదు. పిసిసి అధ్యక్షుడు అమరిందర్ సింగ్ రాజాకు ఇతర ముఖ్యనేతలైన మాజీ ముఖ్యమంత్రి చరణ్‌జిత్ సింగ్ చెన్నీకి పడట్లేదు. సుఖిందర్ సింగ్ రందావాతో సహా చాలా మంది స్థానిక నాయకులు పిసిసి అధ్యక్షుడిని వ్యతిరేకిస్తున్నారు. అయినా ఆయన్ని అధిష్టానం మార్చకపోవడాన్ని పార్టీ మెజారిటీ నాయకులు నిరసిస్తున్నారు.

# క్యాన్సర్ నిర్ధారణ చికిత్స రంగంలో సరికొత్త సాంకేతికత విప్లవం

### – రోబోటిక్ శస్త్రచికిత్స, ఫ్లోరోసెన్స్ గైడెడ్ సర్జరీతో క్యాన్సర్‌కు చెక్

### – రొమ్ము క్యాన్సర్లో ఫ్లోరోసెన్స్ గైడెడ్ సర్జరీ

### – యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీ సర్జికల్ ఆంకాలజీ

### ఆంకాలజీ రోబోటిక్ సైన్సెస్ డాక్టర్ చిన బాబు

ఖమ్మం:క్యాన్సర్ నిర్ధారణ చికిత్స రంగంలో సరికొత్త సాంకేతికతను అందుబాటులోకి తెచ్చిందని ,క్యాన్సర్‌ను నయం చేయడమే కాదు రోగి జీవితాన్ని మరింత మెరుగ్గా మార్చడం కూడా ఆధ ్ననిక శస్త్రచికిత్సల లక్ష్యమని హైదరాబాద్ యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీ సర్జికల్ ఆంకాలజీ ,ఆంకాలజీ రోబోటిక్ సైన్సెస్ డాక్టర్ చిన బాబు పేర్కొన్నారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో శు క్రవారంజరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ట్యూమర్ బయాలజీపై మెరుగైన అవగాహన పెరగడంతో నేటి క్యాన్సర్ శస్త్రచికిత్సల లక్ష్యం కేవలం వ్యాధిని తొలగించడం మాత్రమే కాకుండా రోగికి మంచి జీవన నాణ్యతను అందిస్తూ పూర్తిగా నయం చేస్తుందన్నారు. అత్యంత ముఖ్యమైన సాంకేతిక ఆవిష్కరణలలో రోబోటిక్ శస్త్రచికిత్స, ఫ్లోరోసెన్స్ గైడెడ్ సర్జరీ ఒకటి అని, ఈ ఆధునిక టెక్నాలజీలు అత్యంత ఖచ్చితత్వం, తక్కువ టిష్యూడ్యామేజ్, తక్కువ రక్తనష్టం, వేగవంతమైన కోలుకునే అవకాశాలను అందిస్తున్నాయని అన్నారు. హై-డెఫినిషన్ 3డి విజన్, ట్రెమర్ – ఫ్రీ ఇన్స్ట్రుమెంట్స్, మనిషి చేతి కదలికలనుఅనుకరించే రైస్తెడ్ ఇన్స్ట్రుమెంట్స్ ద్వారా క్లిష్టమైన శస్త్రచికిత్సలను అత్యంత నైపుణ్యంతో నిర్వహించవచ్చునని తెలిపారు. సాధారణంగా చెప్పాలంటే పెద్ద కోతలు లేకుండా కేవలం 8 ఎంఎం చిన్న రంధ్రాల ద్వారా శస్త్రచికిత్స నిపుణుడు తన చేతులు శరీరం లోపల పనిచేస్తున్నట్లుగా ఆపరేషన్ చేయగలుగుతారని, దీని వలన రోగికి తక్కువ నొప్పి, చిన్న మచ్చలు , తక్కువ రక్తనష్టం కలుగుతుందని, ఇంకా స్మార్ట్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కలయికతోశస్త్రచికిత్సలు మరింత ఖచ్చితంగా, సురక్షితంగా మారుతున్నాయని అన్నారు. మహిళల క్యాన్సర్లలో రోబోటిక్ సర్జరీ ముఖ్యంగా గర్భాశయ, అండాశయ క్యాన్సర్లలో రోబోటిక్ శస్త్రచికిత్స గొప్ప ఫలితాలను ఇస్తోందని, రడీకల్ హైస్టెరెక్టమీ, లింఫ్ నోడ్ డిస్సెక్షన్ వంటి క్లిష్టమైన ఆపరేషన్లు సురక్షితంగా చేయవచ్చునని తెలిపారు. గతంలో 4–5 రోజుల ఆసుపత్రి ఉండాల్సి వచ్చేదని, ఇప్పుడు చాలామంది రోగులను 24 గంటల్లోనే డిశ్చార్జ్ చేయవచ్చునని తెలిపారు.

#### రొమ్ము క్యాన్సర్లో ఫ్లోరోసెన్స్ గైడెడ్ సర్జరీ

రొమ్ము క్యాన్సర్ చికిత్సలో కూడా ఫ్లోరోసెన్స్ గైడెడ్




టెక్నాలజీ కొత్త దిశను చూపుతోందని, ప్రత్యేకమైన డై ఇంజెక్షన్ ఇచ్చిన తర్వాత, క్యాన్సర్ నుండి మొదట ప్రభావితమయ్యే సెంటినెల్ లింఫ్ నోడ్స్ ప్రత్యేక కెమెరా ద్వారా స్పష్టంగా కనిపిస్తాయని, దీని వలన అవసరమైన లింఫ్ నోడ్స్‌ను మాత్రమే ఖచ్చితంగా తొలగించవచ్చునని, గతంలో లాగే అన్ని లింఫ్ నోడ్స్ తొలగించాల్సిన అవసరం తగ్గి, చేతి వాపు(లైఎంపీహెడేమా), నొప్పి, ఇతర సమస్యలు గణనీయంగా తగ్గుతాయని అన్నారు. ఇది రోగి జీవన నాణ్యతను మరింత మెరుగుపరుస్తుందన్నారు.

యూరాలజీ క్యాన్సర్లలో సరికొత్త మార్పులు

ప్రోస్టేట్, బ్లాడర్, కిడ్నీ, అడ్రినల్ ట్యూమర్ల చికిత్సలో రోబోటిక్ టెక్నాలజీ పెద్దమార్పు తీసుకొచ్చిందని, ప్రోస్టేట్, బ్లాడర్ క్యాన్సర్లలో పెళవిక్ ప్రాంతం చాలా ఇరుక్కుగా ఉండటం వల్ల ఓపెన్ సర్జరీ క్లిష్టంగా ఉండేదని, ఇప్పుడు రోబోటిక్ సర్జరీ ద్వారా మెరుగైననేర్వ్ ప్రెజర్వేషన్ సాధ్యమై, ఉరినరీ కంటినయన్స్, సెక్సువల్ ఫంక్షన్ మెరుగ్గా కాపాడవచ్చునని తెలిపారు. కిడ్నీ క్యాన్సర్లలో రోబోటిక్ సర్జరీ వలన పార్టియల్ నీఫరెక్టమీ ఎక్కువగా చేయగలుగుతున్నామని, అంటే కేవలం ట్యూమర్ ఉన్న భాగాన్ని మాత్రమే తొలగించి , మిగిలిన ఆరోగ్యకరమైన కిడ్నీని కాపాడటం సాధ్యమవుతోందని, దీని వలన పూర్తి కిడ్నీ తొలగించాల్సిన అవసరం తగ్గి, క్యాన్సర్ నియంత్రణలో ఎలాంటి రాజీ లేకుండా మంచి ఫలితాలు సాధించవచ్చునని తెలిపారు. అడ్రినల్ ట్యూమర్లలో కూడా తక్కువ రక్తనష్టం, చిన్న గాయాలు, వేగవంతమైన కోలుకోవడం వంటి ప్రయోజనాలతో సురక్షితంగా శస్త్రచికిత్సలు చేయవచ్చునని తెలిపారు.

#### కోలోరెక్టల్ క్యాన్సర్లలో ఖచ్చితత్వం

క్యాన్సర్లలో ఈ టెక్నాలజీ పెద్ద మార్పు తీసుకొచ్చింది . ట్యూమర్ను ఖచ్చితంగా గుర్తించి తొలగించడం వల్ల చాలాసార్లు పెర్మనెంట్ కలస్టమీ అవసరం లేకుండా చేయగలుగుతున్నామని డాక్టర్ చిన్నబాబు తెలిపారు. స్మార్ట్ స్థాప్లర్ ఫైర్ టెక్నాలజీ ద్వారా బావల్ ఇండ్స ను మరింత సురక్షితంగా కలపవచ్చునని, లీకేజీ ప్రమాదం తగ్గి, మెరుగైన నేర్వ్ ప్రెజర్వేషన్ వలన ఉరినరీ, సెక్సువల్ క్వాలిటీ అఫ్ లైఫ్ కూడా బాగుంటుందని అన్నారు.

#### ఛాతి క్యాన్సర్ శస్త్రచికిత్సల్లో కొత్త యుగం

ఛాతి శస్త్రచికిత్సలలో కూడా ఇప్పుడు పెద్ద కోతలు వేసే రోజులు పోయాయి. గతంలోలాంగ్ సర్జరీస్ కోసం చెస్ట్ ఓపెన్ చేసి 7–10 రోజుల హాస్పిటల్ స్టే ఉండేది. ఇప్పుడు 8ఎంఎం చిన్న పోర్ట్స్ ద్వారానే సురక్షితంగా లాంగ్ సర్జరీస్ చేయవచ్చు. ఫ్లయ్ టెక్నాలజీ –క్యాన్సర్ను వెలుగులో చూపించే సాంకేతికత ఫ్లయ్ ఫ్లూరెససెన్స్ ఇమగెంగ్ అనేది మరో అద్భుతమైన టెక్నాలజీ అన్ని డాక్టర్ చినబాబు తెలిపారు. ప్రత్యేక డై ఇంజెక్షన్ తర్వాత క్యాన్సర్ టిష్యూలు లేదా లింఫాటిక్ మార్గాలు గ్లో అవ్వడం ద్వారా వాటిని మరింత స్పష్టంగా గుర్తించవచ్చు. సెంటినల్ లింఫ్ నోడ్ మాపింగ్ కూడా మరింత ఖచ్చితంగా చేయగలుగుతున్నామన్నారు.

#### రోగులకు కలిగే ప్రధాన ప్రయోజనాలు

తక్కువ నొప్పి, తక్కువ రక్తనష్టం , తక్కువ ఆసుపత్రి రోజులు, త్వరగా పనికి తిరిగి వెళ్లే అవకాశం, మెరుగైన జీవన నాణ్యత, తక్కువ మచ్చలు, కుటుంబ, భావోద్వేగ ఆర్థిక ఒత్తిడి తగ్గడం తదితర ప్రయోజనాలు కలుగుతాయన్నారు. ఈ విధంగా రోబోటిక్, ఫ్లోరోసెన్స్ గైడెడ్ టెక్నాలజీలు క్యాన్సర్ శస్త్రచికిత్సలను కేవలం వ్యాధి నివారణకే పరిమితం చేయకుండా, రోగి జీవన నాణ్యతను కాపాడే దిశగా ముందుకు తీసుకెళ్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీ మార్కెటింగ్ మేనేజర్ శ్రీకాంత్ దూడ, ఖమ్మం మార్కెటింగ్ మేనేజర్ బాలరాజు పాల్గొన్నారు.


అర్జున్ సమాచారం

www.arjunsamaachaaram.in

తెలుగు దినపత్రిక


## ఆట






# మళ్లీ గంభీర్ ⱽ కోహ్లీ డిష్యూం డిష్యూం?

టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ మధ్య మళ్లీ విభేదాలు తలెత్తాయా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. ఇంగ్లండ్‌తో మూడు వన్డేల సిరీస్ ప్రారంభానికి ముందు ఈ ఇద్దరు మాట్లాడుకోవడం లేదనే వార్తలు అభిమానులను ఆందోళనకు గురి చేస్తున్నాయి.బర్మింగ్‌హామ్ వేదికగా జరిగే తొలి వన్డేలో ఆతిథ్య ఇంగ్లండ్‌తో టీమిండియా అమీతుమీ తేల్చుకోనుంది. ఈ మ్యాచ్ కోసం భారత ఆటగాళ్లు బాగా సన్నదమయ్యారు. నెట్స్‌లో గంటల తరబడి చెమటోడ్చారు. అయితే ప్రాక్టీస్ సెషన్స్‌లో కోహ్లీ, గంభీర్ ఒక్కసారి కూడా మాట్లాడుకోలేదనే పోస్ట్‌లు సోషల్ మీడియా వేదికగా హల్‌ఛల్ చేస్తున్నాయి.విరాట్ కోహ్లీ నెట్ ప్రాక్టీస్ సెషన్‌ను ప్రత్యేకంగా గమనించిన గంభీర్.. అతనితో నేరుగా మాట్లాడకుండా బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్‌కు చెప్పి మరీ మాట్లాడించడం ప్రశ్నార్థకంగా మారింది. ఇందుకు సంబంధించిన వీడియో కూడా నెట్టింట వైరల్‌గా మారింది. ఈ వీడియోలో అనవసర షాట్స్ ఆడబోయిన కోహ్లీ పలుమార్లు క్లీన్ బౌల్డ్ అయ్యాడు. ప్రాక్టీస్ సెషన్ ముగిసిన తర్వాత కోహ్లీతో గంభీర్ నేరుగా మాట్లాడకుండా బ్యాటింగ్ కోచ్‌తో మాట్లాడించడం ఈ విభేదాల వార్తలకు బలం చేకూరుస్తోంది.ప్రాక్టీస్ సెషన్స్ సందర్భంగా గంభీర్ తరుచూ శుభ్‌మన్ గిల్, రోహిత్ శర్మ, బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్‌లతో మాట్లాడినట్లు తెలుస్తోంది. నేరుగా కోహ్లీతో గంభీర్ మాట్లాడిన సందర్భం ఒక్కటి కూడా లేదని ఓ జాతీయ మీడియా పేర్కొంది. ఫైనల్ ప్రాక్టీస్ సెషన్‌లో జట్టులోని ఇతర ఆటగాళ్లందరితో మాట్లాడిన గంభీర్.. కోహ్లీతో మాత్రం మాట్లాడకపోవడం చర్చనీయాంశమైంది. కోహ్లీ కూడా గంభీర్‌తో మాట్లాడే ప్రయత్నం చేయలేదు. దాంతో జట్టులో వాతావరణం అంతా సవ్యంగానే ఉందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గతంలో ఐపీఎల్ సందర్భంగా పలుమార్లు ఈ ఇద్దరూ గొడవపడ్డారు. కానీ గంభీర్ టీమిండియా హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రొఫెషనల్ ప్లేయర్లలా కలిసి మెలిసి పనిచేశారు. కానీ ఏమైందో ఏమో తెలియదు కానీ.. ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌కు ముందు ఈ ఇద్దరూ మాట్లాడుకోవడం లేదనే వార్తలు అభిమానులను గందరగోళానికి గురి చేస్తున్నాయి. ఇప్పటికే టీ20ల్లో క్లీన్ స్వీప్ అయిన టీమిండియా.. కనీసం వన్డేల్లోనైనా గెలవాలని భావిస్తుంది. ఈ క్రమంలో కోహ్లీ, గంభీర్ మధ్య విభేదాలు మ్యాచ్‌ల ఫలితాలపై ఏ మేర ప్రభావం చూపుతాయోననే ఆందోళన అభిమానుల్లో నెలకొంది.




# వన్డేలను 40 ఓవర్లకు కుదిస్తే ఒప్పుకునేది లేదు

టి20 ల హవా, రకరకాల ఫ్రాంచైజీ లీగుల ఎఫెక్ట్ వల్ల వన్డే క్రికెట్ ప్రెజెంట్ తీవ్ర సంక్షోభాన్ని ఫేస్ చేస్తోంది. రీసెంట్ గా ఎడిన్‌బర్గ్‌లో జరిగిన ఐసీసీ యాన్యువల్ కాన్ఫరెన్స్ లో వన్డే మ్యాచులను 50 ఓవర్ల నుంచి 40 ఓవర్లకు కుదించేలా మేజర్ డిస్కషన్స్ జరిగాయి. ఈ హాట్ టాపిక్ పై మంగళవారం ఇంగ్లాండ్‌తో జరగబోయే ఫస్ట్ వన్డే మ్యాచ్ కు ముందు జరిగిన ప్రెస్ మీట్ లో ఇండియా వన్డే, టెస్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ చాలా స్ట్రాంగ్ గా రియాక్ట్ అయ్యాడు. వన్డేలను 40 ఓవర్లకు మార్చాలనే ఐడియాను గిల్ కంప్లీట్ గా రిజెక్ట్ చేశాడు. వన్డే ఫార్మాట్ ను మళ్లీ ఇంట్రెస్టింగ్ గా మార్చడానికి బైలాటరల్ సిరీస్ ల కంటే పాత రోజుల్లో లాగా ట్రయాంగులర్ లేదా క్వాడ్రాంగులర్ సిరీస్ లను మళ్లీ స్టార్ట్ చేయాలని గిల్ ఒక క్రేజీ ఐడియాను ఐసీసీ ముందుకు తెచ్చాడు. "వన్డేలను 40 ఓవర్లకు తగ్గించాల్సిన అవసరం అస్సలు లేదు. మేము చిన్నప్పుడు ఆస్ట్రేలియా, ఇండియా, శ్రీలంక జట్ల మధ్య జరిగే ట్రయాంగులర్ సిరీస్ లను విపరీతంగా ఎంజాయ్ చేసేవాళ్ళం. రెండు వేర్వేరు బలమైన జట్లతో డిఫరెంట్ వెన్యూస్ లో తలపడటం వల్ల చూసే ఆడియన్స్ కు, ఆడే ప్లేయర్లకు ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ దొరుకుతుంది" అని 26 ఏళ్ల గిల్ అభిప్రాయపడ్డాడు. తన చిన్నతనం అంతా 50 ఓవర్ల క్రికెట్ తోనే సాగిందని, వరల్డ్ కప్ అనగానే ప్రతీ ఒక్కరికీ గుర్తొచ్చేది 50 ఓవర్ల మెగా ఈవెంట్ మాత్రమేనని చెప్పాడు. క్రికెట్ లో ప్రతీ ఒక్కరూ గెలవాలని కలలు కనే మోస్ట్ ప్రెస్టీజియస్ ట్రోఫీ 50 ఓవర్ల వరల్డ్ కప్పేనని గిల్ ఎమోషనల్ గా గుర్తుచేసుకున్నాడు.

# ఇంగ్లాండ్ నయా ఓపెనర్ గా జాకబ్ బెథెల్ ప్రమోషన్..

ఇండియా, ఇంగ్లాండ్ జట్ల మధ్య జరగబోయే త్రీ–మ్యాచ్ వన్డే సిరీస్ కోసం క్రేజీ సమరానికి టైమ్ ఫిక్స్ అయింది. బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ వేదికగా మంగళవారం జరగబోయే ఫస్ట్ వన్డే మ్యాచ్ కోసం హోస్ట్ టీమ్ ఇంగ్లాండ్ తమ స్ట్రాంగ్ ప్లేయింగ్ ఎలెవన్ ను అఫీషియల్ గా అనౌన్స్ చేసింది. ఈ మ్యాచ్ లో యంగ్ అండ్ డైనమిక్ ఆల్‌రౌండర్ జాకబ్ బెథెల్, సీనియర్ బ్యాటర్ బెన్ డకెట్‌తో కలిసి ఓపెనర్ గా బరిలోకి దిగబోతున్నట్లు మేనేజ్‌మెంట్ కన్ఫర్మ్ చేసింది. ఈ మ్యాచ్ ఇంగ్లాండ్ స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ జోస్ బట్లర్ కెరీర్ లో ఒక మైండ్ బ్లాకింగ్ పర్సనల్ మైల్‌స్టోన్ గా నిలవబోతోంది.

# కూతురు, కుమారుడిని బావిలోకి తోసేసి..




రంగారెడ్డి జిల్లా శంకర్పల్లి మండలం కొత్తపల్లి గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. బావిలో దూకి తల్లి, కుమార్తె ఆత్మహత్య చేసుకు న్నారు. క్షణికావేశంలో ఇద్దరు పిల్లలతో సహ తల్లి బావిలోకి దూకింది. ఈ ఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలి పిన వివరాలు ఇలా ఉన్నాయి. వికారాబాద్ జిల్లా యా లాల మండలం సంగెం గ్రామానికి చెందిన సుధాకర్ బతుకుదెరువు కోసం 12 సంవత్సరాల క్రితం శంకర్ పల్లి మం డలం కొత్తపల్లి గ్రామానికి వలస వచ్చారు. అక్కడ ఓ వ్యవసాయ పొలంలో కూలి పనులు చేసుకుం టూ తన భార్య వసంత (35), కుమార్తె నవ్య (15), కుమారుడు వరుణ్ తో కలిసి నివాసం ఉంటున్నారు. గత నిన్న రాత్రి సుధాకర్, భార్య మధ్య తీవ్రస్థాయిలో గొడవ జరిగింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన వసంత.. క్షణికావేశంలో పిల్ల లిద్దరినీ తీసుకుని రాత్రి వేళ వ్యవసాయ భూమి వద్దకు చేరుకుని పిల్లలతో సహా బావిలోకి దూకింది. ఈ ఘటనలో తల్లీకూతురు మృతి చెందారు.


చెట్టు కొమ్మ పట్టుకుని.. బావిలో పడిన సమయంలో తీవ్ర భయాందో ళనకు గురైన కుమారుడు వరుణ్ బావి లోపల ఉన్న ఒక చెట్టు కొమ్మను గట్టిగా పట్టుకుని వేలాడుతున్నాడు. అంతలోనే తండ్రి అక్కడికి చేరుకొని బాబును రక్షించాడు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాలను వెలికితీశారు. కుటుంబ కలహాల నేపథ్యం లోనే ఈ ఘోరం జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ఈపీఎఫ్ఓ వన్-టైమ్ సెటిల్మెంట్ స్కీమ్ 'విశ్వాస్ 2026' ప్రారంభం

కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్ఓ) యాజమాన్యాలకు ఊరటనిచ్చేలా కీలక నిర్ణయం తీసుకుంది. ఈపీఎఫ్ అండ్ ఎంపీ చట్టం 1952లోని సెక్షన్ 14బీ, సామాజిక భద్రతా కోడ్ 2020లోని సెక్షన్ 128 కింద విధించిన జరిమానాలు, డ్యామేజీలకు సంబంధించిన వివాదాలను సామరస్య పూర్వకంగా పరిష్కరించేందుకు విశ్వాస్, 2026, పేరిట ఒక వన్–టైమ్ సెటిల్మెంట్ పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం జూన్ 29, 2026న ఈపీఎఫ్ పథకం 2026లో భాగంగా నోటిఫై చేయబడి, అదే రోజు నుంచి అమలులోకి వచ్చింది. నోటిఫికేషన్ వెలువడిన తేదీ నుంచి ఆరు నెలల పాటు ఈ స్కీమ్ అందుబాటులో ఉంటుంది.సంస్థల్లో స్వచ్ఛంద సమ్మతిని ప్రోత్సహించడం, కోర్టు కేసులను తగ్గించడం, ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడుతూనే దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న జరిమానాల వివాదాలను వేగంగా పరిష్కరించడమే లక్ష్యంగా ఈపీఎఫ్ఓ ఈ పథకాన్ని తీసుకొచ్చింది. ఈ స్కీమ్ ద్వారా అర్హత కలిగిన కేసులను పారదర్శకంగా, పూర్తిగా డిజిటల్ విధానంలో, నిర్ణీత వ్యవధిలో పరిష్కరించుకునే అవకాశాన్ని యాజమాన్యాలకు కల్పిస్తున్నారు.న్యాయస్థానాల్లో సవాల్ చేయబడిన కేసులు, రికవరీ పెండింగ్లో ఉన్న లేదా పాక్షికంగా జరిగిన జరిమానా ఉత్తర్వులు (ఆర్ఆర్సీ కేసులతో సహా), నోటీసులు జారీ చేసి తుది ఉత్తర్వులు వెలువడని కేసులు, అలాగే ఇంకా నోటీసులు జారీ చేయని కేసులను ఈ పథకం పరిధిలోకి తీసుకువచ్చారు. విశ్వాస్ 2026 కింద, జూన్ 14, 2024కి ముందు ఉన్న డిఫాల్ట్లకు సంబంధించిన జరిమానాలు లేదా డ్యామేజీలను భారీగా తగ్గించిన రేట్లతో తిరిగి లెక్కిస్తారు. రెండు నెలల వరకు డిఫాల్ట్లకు నెలకు 0.25 శాతం, రెండు నుంచి నాలుగు నెలల లోపు ఉంటే 0.50 శాతం, నాలుగు నెలలు దాటితే 1.00 శాతం చొప్పున జరిమానా విధిస్తారు. పెండింగ్ వివాదాలను త్వరితగతిన పరిష్కరించుకునేలా యాజమాన్యాలను ప్రోత్సహించేందుకే ఈ రాయితీ రేట్లను ప్రకటించారు. అయితే, ఈ పథకం ప్రయోజనాలను పొందాలంటే దరఖాస్తు సమర్పించడానికి ముందే చట్ట నిబంధనల ప్రకారం చెల్లించాల్సిన మొత్తం వడ్డీని పూర్తిగా చెల్లించి ఉండాలి. అలాగే, ఈ పథకం కింద పరిష్కరించబడిన వివాదాలపై భవిష్యత్తులో ఎలాంటి అప్పీలు చేయబోమని యాజమాన్యాలు ఒక హామీ పత్రాన్ని కూడా సమర్పించాల్సి ఉంటుంది.ఇప్పటికే చెల్లించిన జరిమానా మొత్తాల సర్దుబాటు, అప్పీళ్ల కోసం చేసిన చట్టబద్ధమైన ప్రీ–డిపాజిట్ల నియంత్రణ వంటి అంశాలపై ఈ పథకంలో స్పష్టమైన నిబంధనలు పొందుపరిచారు. అయితే, మోసాలకు పాల్పడినట్లు తేలిన కేసులు, రికార్డులను తప్పుదోవ పట్టించినవి, ఇప్పటికే జరిమానాలు పూర్తిగా రికవరీ చేయబడినవి, చట్టబద్ధమైన వడ్డీని పూర్తిగా డిపాజిట్ చేయని కేసులకు ఈ పథకం వర్తించదు. ఈ స్కీమ్ వినియోగించుకోవాలనుకునే వారు ఈపీఎఫ్ఓ ఎంప్లాయర్ పోర్టల్ ద్వారా డిజిటల్ సిగ్నేచర్ సర్టిఫికెట్ (డీఎస్సీ) లేదా ఈ–సైన్ ఉపయోగించి ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుల పరిశీలన, ఆన్లైన్ వెరిఫికేషన్ వేగవంతంగా పూర్తి చేసి సకాలంలో ఆదేశాలు జారీ చేయడానికి ఈపీఎఫ్ఓ అన్ని జోనల్, ప్రాంతీయ, జిల్లా కార్యాలయాలకు మార్గదర్శకాలను జారీ చేసింది. యాజమాన్యాలకు సహాయం చేయడానికి ఫీల్డ్ ఆఫీసుల్లో ప్రత్యేకంగా 'విశ్వాస్ సెల్స్'ను ఏర్పాటు చేసినట్లు ఈపీఎఫ్ఓ వెల్లడించింది. పెండింగ్లో ఉన్న వివాదాలను పరిష్కరించు కోవడానికి ఈ వన్–టైమ్ అవకాశాన్ని అర్హులైన యాజమాన్యాలన్నీ సద్వినియోగం చేసుకోవాలని కోరింది.

## తెలంగాణలో నూతన ఈహెచ్ఎస్ ప్రారంభం

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు నగదు రహిత వైద్య చికిత్సలు అందించే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించిన నూతన ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈహెచ్ఎస్) లాంఛనంగా ప్రారంభమైంది. సచివాలయంలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ ఎన్ఈహెచ్ఎస్ పోర్టల్తో పాటు కొత్త హెల్త్ కార్డులను ఆవిష్కరించారు. అనంతరం ఉద్యోగ సంఘాల ప్రతినిధులకు నూతన హెల్త్ కార్డులను స్వయంగా అందజేశారు. దాదాపు 9.5 లక్షల మంది ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య సమస్యలకు ఈ పథకం ద్వారా శాశ్వత పరిష్కారం లభించనుంది.ఈ నూతన విధానం ప్రకారం ప్రతి నెలా ఉద్యోగుల మూల వేతనం నుంచి 1.5 శాతం చందాను ఈహెచ్ఎస్ కోసం వసూలు చేస్తారు. దానికి సరిసమానమైన మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా జమ చేస్తుంది. అంతేకాకుండా, ఈ పథకం కింద అందించే వైద్య చికిత్సలకు సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్ (సీజీహెచ్ఎస్) రేట్లను వర్తింపజేయనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఈహెచ్ఎస్ ప్రారంభంతో రాష్ట్రంలో ఒక నూతన అధ్యాయం మొదలైందని, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరువ చేయడంలో ఉద్యోగుల పాత్ర అత్యంత కీలకమని కొనియాడారు. ఉద్యోగులందరినీ తమ సొంత బిడ్డలుగానే ప్రభుత్వం భావిస్తోందని, గతంలో వైద్య ఖర్చులు భరించలేక పోతున్నామని వారు మొరపెట్టుకున్న నేపథ్యంలోనే ఈ సమగ్ర విధానాన్ని తీసుకువచ్చామన్నారు. ఇకపై నగదు రహిత చికిత్స విషయంలో ఉద్యోగులు పూర్తి ధైర్యంగా ఉండొచ్చని ఆయన భరోసా ఇచ్చారు. తమ ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని, అధికారంలోకి రాగానే రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచి 1.06 కోట్ల మంది పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని అందిస్తున్నామని వివరించారు. గత ప్రభుత్వం ఏళ్లుగా ఉద్యోగుల



విజ్ఞప్తులను పట్టించుకోలేదని, ఏకంగా రూ.2 వేల కోట్ల మెడికల్ బిల్లులను పెండింగ్లో పెడితే, తమ ప్రజా ప్రభుత్వం వాటన్నింటినీ క్లియర్ చేసిందని ఆయన గుర్తు చేశారు. ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహ మాట్లాడుతూ.. రాష్ట్రంలో సుమారు 91 శాతం మంది ప్రజలకు రాజీవ్ ఆరోగ్యశ్రీ కార్డులు ఉన్నాయని, ఈ ట్రస్ట్ ద్వారా ఎంతో ఖరీదైన వైద్యాన్ని సైతం పేదలకు ఉచితంగా అందిస్తున్నామని వెల్లడించారు. ప్రభుత్వ పాలనలో భాగస్వాములవుతున్న ఉద్యోగులను, వారి కుటుంబాలను ఆరోగ్యపరంగా ఆదుకోవాల్సిన బాధ్యత తమపై ఉందని స్పష్టం చేశారు.

# అక్టోబరు వరకు లోటు వర్షపాతమే.. సాగునీటి కొరతతో అన్నదాతకు గడ్డు కాలం

తెలంగాణ రాష్ట్రంలో వానాకాలం సీజన్ అత్యంత కీలకమైన ఐదు నెలల పాటు తీవ్రమైన వర్షాభావ పరిస్థితులను ఎదుర్కోబోతోందని ప్రభుత్వం వెల్లడించడం రైతాంగాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. గత 46 రోజులుగా లోటు వర్షపాతం కొనసాగుతుండగా, ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో సైతం సాధారణం కంటే తక్కువ వర్షపాతమే నమోదవుతుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఎల్నినో ప్రభావం కారణంగా నైరుతి రుతుపవనాలు బలహీనపడటంతో రాష్ట్రంలో సాధారణం కంటే దాదాపు 25 శాతం తక్కువ వర్షపాతం కురిసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా జులైలో 25 శాతం, ఆగస్టులో 15 శాతం, సెప్టెంబరులో 42 శాతం, అక్టోబరులో ఏకంగా 55 శాతం మేర లోటు వర్షపాతం ఉంటుందని తాజా సీజనల్ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఈ విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం 'అత్యవసర ప్రత్యామ్నాయ వ్యవసాయ ప్రణాళిక–2026'ను విడుదల చేసింది. గోదావరి, కృష్ణా నదీ పరీవాహక ప్రాంతాల్లో సైతం సీజనల్ వర్షపాతం ఆశాజనకంగా లేకపోవడంతో, నీటి లభ్యతను బట్టి మాత్రమే రైతులు పంటలను ఎంపిక చేసుకోవాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.ప్రస్తుతం ప్రాజెక్టులలో నీటి నిల్వల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది. గోదావరి నదీ పరీవాహక ప్రాంతంలోని అన్ని ప్రధాన, మధ్యతరహా రిజర్వాయర్లలో కలిపి 27.69 టీఎంసీలు, కృష్ణా బేసిన్లోని ప్రాజెక్టుల్లో కేవలం 14.81 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉంది. ఈ నీరు ప్రధానంగా తాగునీటి అవసరాలకు మాత్రమే సరిపోతుంది. రాబోయే రోజుల్లో భారీ వర్షాలు కురిసి రిజర్వాయర్లలోకి భారీ ఎత్తున వరద నీరు వచ్చి చేరితే తప్ప, సాగునీటిని విడుదల చేసే పరిస్థితి కనుచూపు మేరలో కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో ఎక్కువ నీరు అవసరమయ్యే పంటల విస్తీర్ణాన్ని రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ పెంచకూడదని, సాధ్యమైనంత వరకు తక్కువ కాలంలో పూర్తయ్యే పంటలనే ఎంచుకోవాలని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. ఈ వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా



రైతులు కరవును తట్టుకునే ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపాల్సిన ఆవశ్యకత ఉంది. గ్రామాల్లోని చెరువులు నిండితేనే ఈ నెలాఖరు వరకు వరిలో స్వల్పకాలిక రకాలను సాగుచేసుకోవాలి. వరికి బదులుగా మొక్కజొన్న హైబ్రిడ్ రకాలను, అలాగే కందులు, రాగులు, శనగలు, సజ్జలు, ఉలవలు, నువ్వులు, ఆముదాలు వంటి ఆరుతడి పంటలను వేసుకోవడం ఉత్తమం. పత్తి సాగు చేయాలనుకునే రైతులు ఈ నెల 20వ తేదీ లోపే విత్తనాలు నాటుకోవాలి. అదే సమయంలో అందుబాటులో ఉన్న కొద్దిపాటి సాగునీటిని అత్యంత పొదుపుగా వినియోగించుకోవాలి. పొలంలోనే వర్షపు నీటిని నిల్వచేసే తేమ సంరక్షణ పద్ధతులు, క్షేత్ర స్థాయి వర్షపు నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలి. బిందు, తుంపర సేద్యం వంటి సూక్ష్మ నీటిపారుదల విధానాలను అవలంబించడం ద్వారా నీటిని ఆదా చేసుకుని పంటలను కాపాడుకోవచ్చు.ఇప్పటికే వర్షాభావం కారణంగా రాష్ట్రంలో పత్తి రైతులు తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. ఈ వానాకాలం సీజన్లో 47.31 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటి వరకు 40.92 లక్షల ఎకరాల్లో రైతులు విత్తనాలు వేశారు. ఆలస్యంగానైనా వరుణుడు కరుణిస్తాడన్న ఆశతో లక్షల ఎకరాల్లో పెట్టుబడులు పెట్టిన అన్నదాతలకు నిరాశే ఎదురవుతోంది. నెల రోజుల వయసున్న మొక్కలు ఎదిగే దశలో ప్రతి ఐదు రోజులకోసారి నీటి తడి అందించడం అత్యంత కీలకం. కానీ, గత రెండు వారాలుగా చుక్క వాన లేకపోవడంతో పంట ఎండుముఖం పడుతోంది. మరో వారం రోజుల్లో సరైన వర్షాలు కురవకపోతే మొలకెత్తిన పత్తి పంటపై ఆశలు వదులుకోవాల్సిందేనని వ్యవసాయ శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కళ్లెదుటే ఎండిపోతున్న పంటను చూసి రైతులు తల్లడిల్లిపోతున్న ఈ తరుణంలో, ప్రభుత్వ ప్రత్యామ్నాయ ప్రణాళికలే వారికి దిక్సూచిగా మారనున్నాయి.

# కాకతీయ వర్సిటీని రాజకీయ వేదికగా మార్చొద్దు:రాజేందర్ రెడ్డి

కాకతీయ యూనివర్సిటీని రాజకీయాలకు అడ్డాగా మార్చకుండా, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం జ్ఞాన కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పిలుపునిచ్చారు.శుక్రవారం కాకతీయ యూనివర్సిటీలో పర్యటించిన ఆయన మీడియాతో మాట్లాడుతూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. కొందరు తమ రాజకీయ ప్రయోజనాల కోసం అమాయక విద్యార్థులను రెచ్చగొట్టి వర్సిటీ అభివృద్ధిని అడ్డుకునే కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. వర్సిటీలో నెలకొన్న సమస్యలపై ఇప్పటికే ఎంపీలు, ఎమ్మెల్యేలు, అధికారులతో కలిసి పలుమార్లు సమీక్షలు జరిపి, సమగ్ర డీపీఆర్ రూపొందించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామని వివరించారు. సీఎం వరంగల్ పర్యటనలోనూ వర్సిటీ సమస్యలను ప్రత్యేకంగా ప్రస్తావించి, అభివృద్ధి నిధులు, ప్రణాళికలపై చర్చించినట్లు వెల్లడించారు. గత పదేళ్లలో కాకతీయ పరిస్థితి ఎలా దిగజారిందో, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఎలాంటి మార్పులు మొదలయ్యాయో విద్యార్థులు, అధ్యాపకులు నిష్పక్షపాతంగా విశ్లేషించుకోవాలని సూచించారు.వర్సిటీ ప్రాంగణంలో ఏర్పాటు చేయతలపెట్టిన ఇంటిగ్రేటెడ్ స్కూల్ పట్ల బీఆర్ఎస్, బీజేపీ అనుబంధ విద్యార్థి సంఘాలు వ్యవహరిస్తున్న తీరును ఎమ్మెల్యే తీవ్రంగా తప్పు బట్టారు. గతంలో వర్సిటీ భూములను సబ్స్టేషన్, బ్యాంక్, పోలీస్ స్టేషన్, తదితర ప్రభుత్వ శాఖలకు



కేటాయించినప్పుడు మౌనం వహించిన విద్యార్థి సంఘాలు.. ఇప్పుడు అందరికీ ఉపయోగపడే ఇంటిగ్రేటెడ్ స్కూల్ను మాత్రమే ఎందుకు వ్యతిరేకిస్తున్నాయని నిలదీశారు. అప్పట్లో ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేయని వారు, ఇప్పుడు కేవలం రాజకీయ అజెండాతోనే ఉద్యమాలు చేస్తున్నారని ఆరోపించారు. ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఈసీ) ఆమోదం పొందిన తర్వాత కూడా అభివృద్ధి పనులను అడ్డుకోవడం దురదృష్ట కరమన్నారు. మెస్, క్యాంటీన్లలో అక్రమాలు జరుగుతున్నా స్పందించని ఈ సంఘాలు, అభివృద్ధి పనుల విషయంలో రాద్ధాంతం చేయడం వెనుక ఉన్న కుట్రలను విద్యార్థులు గమనించాలన్నారు. బ్రోకర్లు, మధ్యవర్తులు రాజకీయ స్వార్థం కోసం వర్సిటీని నాశనం చేయాలని చూస్తే తాను చూస్తూ ఊరుకోబోనని, అధికారులు చర్యలు తీసుకోకపోతే ప్రజల పక్షాన తానే పోరాడుతానని హెచ్చరించారు. ఉస్మానియా యూనివర్సిటీ తరహాలో కాకతీయకు కూడా ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ కమిటీలు ఉండాలని, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించే అధికారులను బదిలీ చేసి సమర్థవంతమైన పాలనా వ్యవస్థను తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు.అలాగే, మామునూరు విమానాశ్రయం అంశంపై బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్న తీరును ఎమ్మెల్యే తీవ్రంగా ఖండించారు. ఈ ప్రాజెక్టు గురించి మాట్లాడే నైతిక హక్కు వారికి లేదన్నారు. పదేళ్లు అధికారంలో ఉండి విమానాశ్రయానికి అవసరమైన కేంద్ర అనుమతులు, సాంకేతిక క్లియరెన్స్లు తీసుకురాలేదని, జీఎంఆర్కు రూ.350 కోట్లు చెల్లించినా కనీసం అడుగు ముందుకు వేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే సీఎం రేవంత్ రెడ్డి చొరవతో కేంద్రంతో చర్చలు జరిపి స్పష్టమైన పురోగతి సాధించామని, ఎన్నో ఏళ్లుగా నిలిచిపోయిన ప్రాజెక్టుకు కొత్త ఊపు తెచ్చామని స్పష్టం చేశారు. పదేళ్లు ఏమీ చేయని వారు ఇప్పుడు విమానాశ్రయం పై తమకే క్రెడిట్ దక్కాలన్నట్లు మాట్లాడటం వారి రాజకీయ దివాలాకోరుతనానికి నిదర్శనమన్నారు. కాగా, ఈ పర్యటనలో భాగంగా ఇటీవల కాకతీయ వర్సిటీ జాయింట్ డైరెక్టర్గా బాధ్యతలు చేపట్టిన పుల్ల శ్రీనివాస్, హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ పెద్దమల్ల శ్రీనివాస్లను ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రత్యేకంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

# దేశంలో పట్టాలెక్కిన తొలి హైడ్రోజన్ రైలు.. జెండా ఊపి ప్రారంభించిన ప్రధాని మోదీ

భారతీయ రైల్వే చరిత్రలో సరికొత్త అధ్యాయం మొదలైంది. పర్యావరణానికి ఎలాంటి హాని కలగకుండా, కాలుష్య రహిత ప్రయాణమే లక్ష్యంగా దేశంలోనే తొలి హైడ్రోజన్ రైలు పట్టాలెక్కింది. హరియాణా రాష్ట్రంలోని జింద్ నుంచి సోనిపట్ మధ్య నడిచే ఈ తొలి హైడ్రోజన్ రైలును ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం లాంఛనంగా జెండా ఊపి ప్రారంభించారు. పది కోచ్లతో, పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన ఈ రైలు భారతీయ ఇంజినీరింగ్ నైపుణ్యానికి ప్రతీకగా నిలిచింది. జింద్ రైల్వే స్టేషన్కు చేరుకున్న ప్రధాని, ముందుగా ఈ రైలు నమూనాను పరిశీలించి, అనంతరం పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ తొలి ప్రయాణంలో పాల్గొన్న విద్యార్థులకు, సిబ్బందికి, అక్కడి ప్రజలకు ఆయన అభివాదం చేశారు. ఈ హైడ్రోజన్ రైలు జింద్ నుంచి సోనిపట్ వరకు ఉన్న 89 కిలోమీటర్ల దూరాన్ని కేవలం రెండు గంటల్లోనే చేరుకుంటుంది. ఈ మార్గంలో జింద్ సిటీ, పాండు పిండారా, లలిత్ ఖేడా, భంబేవా, ఇషాపుర్ ఖేరి, బుటానా తదితర 12 స్టేషన్లలో ఈ రైలుకు స్టాపులు ఉంటాయి. వారంలో ఆదివారం మినహా మిగతా ఆరు రోజులు ఈ రైలు ప్రయాణికులకు అందుబాటులో ఉంటుంది. ప్రతి ఆదివారం షెడ్యూల్డ్ నిర్వహణ, సాంకేతిక తనిఖీల నిమిత్తం ఢిల్లీలోని షకుర్బస్తి వర్క్షాప్నకు దీనిని తరలిస్తారని రైల్వే అధికారులు వెల్లడించారు.సాధారణంగా విద్యుత్ తీగలు లేదా డీజిల్తో నడిచే రైళ్లకు భిన్నంగా, ఈ హైడ్రోజన్ రైలు సొంతంగా విద్యుత్ను ఉత్పత్తి చేసుకుని నడుస్తుంది. హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ టెక్నాలజీ ఆధారంగా, హైడ్రోజన్ను విద్యుత్గా మార్చుకుని ఇంజిన్ను నడిపిస్తుంది. ఈ ప్రక్రియలో కేవలం నీటి ఆవిరి మాత్రమే ఉద్గారంగా వెలువడుతుంది కాబట్టి, పర్యావరణానికి ముప్పు వాటిల్లదు. తద్వారా కర్బన ఉద్గారాలు తగ్గడమే కాకుండా, విదేశాల నుంచి దిగుమతి చేసుకునే శిలాజ ఇంధనాలపై ఆధారపడటం గణనీయంగా తగ్గుతుంది. డీజిల్ ఇంజిన్లతో పోలిస్తే ఈ రైలు ఇంజిన్ చేసే శబ్దం కూడా చాలా తక్కువగా ఉంటుంది. సాంకేతికంగా ఈ రైలు అత్యంత శక్తివంతమైనది. 3,200 హెచ్పీ సామర్థ్యం గల ప్రొపల్షన్ వ్యవస్థతో నడిచే ఈ రైలు, ప్రపంచంలోనే పది బోగీలతో కూడిన అత్యంత పొడవైన ప్యాసింజర్ హైడ్రోజన్ రైలుగా రికార్డు సృష్టించింది. ఇందులో ఒకేసారి సుమారు 2,600 మంది ప్రయాణించే అవకాశం ఉంది. ప్రయాణికుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ.. హైడ్రోజన్ లీకేజీ, వేడి, మంటలు లేదా పొగను వెంటనే పసిగట్టే అత్యాధునిక సెన్సార్ వ్యవస్థలను ఇందులో ఏర్పాటు చేశారు. విపత్కర పరిస్థితుల్లో ఆటోమేటిక్ షట్–ఆఫ్ సిస్టమ్ వెంటనే స్పందించి హైడ్రోజన్ సరఫరాను తనంతట తానే నిలిపివేస్తుంది. అత్యాధునిక వెంటిలేషన్ వ్యవస్థతో పాటు, లోకో పైలట్ క్యాబిన్లో ప్రతిక్షణం రైలు పరిస్థితిని పర్యవేక్షించే ప్రత్యేక స్క్రీన్ వంటి అత్యున్నత భద్రతా ప్రమాణాలతో ఈ రైలును తీర్చిదిద్దారు.



## నకిలీ టీ పొడి గుట్టురట్టు.. తనిఖీల్లో భారీగా స్వాధీనం.

### మందమర్రి టోల్‌గేట్ సమీప భోజనశాలలో తనిఖీలు.. చట్టపరమైన చర్యలకు అధికారుల సిద్ధత.



**మంచిర్యాల:**

మందమర్రి టోల్‌గేట్ సమీపంలోని ఓ భోజనశాలలో నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో పేరొందిన సంస్థ పేరుతో విక్రయానికి ఉంచిన నకిలీ టీ పొడి ప్యాకెట్లను ఆహార భద్రత శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆహార భద్రత శాఖ తనిఖీ అధికారి ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బృందానికి చెందిన రాజేందర్, సురేందర్ సహకారంతో నిర్వహించిన తనిఖీల్లో ఈ నకిలీ ఉత్పత్తులు వెలుగులోకి వచ్చాయి. ప్రముఖ సంస్థ పేరును పోలి ఉండే ప్యాకెట్లతో వినియోగదారులను మోసగించే ప్రయత్నం జరిగినట్లు అధికారులు గుర్తించారు. వెంటనే నకిలీ టీ పొడి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్న అధికారులు భోజనశాల నిర్వాహకుల నుంచి వివరాలు సేకరించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ప్రజలు ఆహార పదార్థాలు కొనుగోలు చేసే సమయంలో ప్యాకింగ్, తయారీ తేదీ, వినియోగ గడువు, గరిష్ఠ చిల్లర ధర, నాణ్యత గుర్తులను తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. నకిలీ ఉత్పత్తులు కనిపించిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఆహార భద్రత కోసం అధికారులు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నారని, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. స్థానికులు అధికారుల అప్రమత్తతను అభినందించారు.

## జగిత్యాల పట్టణంలోని 42వ వార్డులో ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం అమలు తీరును బీజేపీ జగిత్యాల నియోజకవర్గం ఇంచార్జ్ డా. బోగ శ్రావణి పరిశీలించారు.




**జగిత్యాల ప్రతినిధి ::అర్జున్ సమాచారం జులై 17**

ప్రజాస్వామ్యంలో ఓటరు జాబితా అత్యంత కీలకమని, ఎన్నికల సంఘం అధికారులు ఎంత బాధ్యతతో పనిచేస్తున్నారో, రాజకీయ పార్టీలు కూడా అంతే బాధ్యతతో ప్రజలకు అవగాహన కల్పిస్తూ సహకరిస్తున్నాయని డా. బోగ శ్రావణి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 5వ వార్డ్ కౌన్సిలర్ వేముల శ్రీనివాస్, 49వ వార్డు కౌన్సిలర్ సిరిపురం శ్రీలత శ్రీనివాస్, అముద రాజు, గదాసు రాజేందర్, గట్ల శ్రీనివాస్, బద్దెల గంగరాజం మరియు స్థానిక ప్రజాప్రతినిధులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు వార్డు ప్రతినిధులు పాల్గొన్నారు.

## సర్ డిజిటలైజేషన్ 60 శాతం పూర్తి

తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటి వరకు 'సర్' ప్రక్రియ డిజిటలైజేషన్ 60 శాతం పూర్తయిందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలోని సుల్తాన్‌పూర్, ఐలాపూర్, పటాన్‌చెరు ప్రాంతాల్లో జరుగుతున్న 'సర్' శిబిరాలను ఆయన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గడువు పొడిగింపు తేదీని దృష్టిలో ఉంచుకుని ఈ డిజిటలైజేషన్ ప్రక్రియను నిరంతరాయంగా కొనసాగించాలని బీఎల్వోలకు సూచించారు. ఇప్పటి వరకు గ్రామీణ ప్రాంతాల్లో 80 శాతం, పట్టణ ప్రాంతాల్లో 50 శాతం మేర ఈ 'సర్' ప్రక్రియ పూర్తయిందని ఆయన వివరించారు. ఇంకా ఎన్యూమరేషన్ పత్రాలు అందని వారుంటే వెంటనే 'సర్' ప్రక్రియ సూపర్‌వైజర్లను సంప్రదించి ఆ పత్రాలను తీసుకోవాలని సూచించారు. కాగా, రాష్ట్రంలో ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 24వ తేదీతో ముగియాల్సిన 'సర్' సర్వే గడువును అధికారులు ఆగస్టు 3వ తేదీ వరకు పొడిగించిన విషయం విదితమే.



# వనమహోత్సవం లో ముఖ్యఅతిధి డాక్టర్ సంజయ్ కుమార్ ఎమ్మెల్యే

**జగిత్యాల ప్రతినిధి ::అర్జున్ సమాచారం జులై 17**



ఇస్కా ఫౌండేషన్ – రోటరీ క్లబ్ – రెడ్ క్రాస్ – ఆధ్వర్యంలో శుక్రవారం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల లో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా పండ్ల మొక్కలు నాటడం, జల్ ప్రతిజ్ఞ, హార్ట్ఫుల్ నెస్ వారి వ్యాసరచన పోటీలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సత్య ప్రణవ్, ూఎఎ చైర్మెన్ గడ్డం నారాయణ రెడ్డి, కౌన్సిలర్ లు అరవ లక్ష్మీ రాజు, మమత రామకృష్ణ రెడ్డి, కూతురు శేఖర్ , కార్యక్రమం నిర్వాహకులు, ఇస్కా ఫౌండేషన్ నిర్వాహకులు, రోటరీ క్లబ్ సభ్యులు మంచాల కృష్ణ, సిరిసిల్ల శ్రీనివాస్ టివి సూర్యంతోపాటుగా త్రివేణి సాగర్, ఏంటోను ముత్తు, పాల్తేపు భూమేష్, ప్రిన్సిపాల్ ఆలియా మక్సూద్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్, ఎన్ ఎస్ ఎస్ కోఆర్డినేటర్ తిరుపతిరెడ్డి, మాజీ ఙ్ఖ సభ్యులు సుధాకర్ రావు, గంగరాజం, శరత్ రావు, రహీం, నాయకులు, విద్యార్థులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ మాట్లాడుతూ, విద్యార్థులు విద్యతోపాటుగా సామాజిక కార్యక్రమాలై అవగాహనా పెంచుకోవాలని అన్నారు. విద్యారంగం మరింతగా అభివృద్ధి చెందడానికి గాను శాసనసభ్యుడిగా తనవంతు కృషి చేస్తున్నానన్నారు. బాలికల, బాలుర జూనియర్ కళాశాలల అభివృద్ధికి సుమారుగా 2 కోట్ల 16 లక్షల వ్యయంతో ప్రతిపాదనలు పంపడం జరిగిందని వివరించారు. అనంతరం జలసంరక్షణ పై ప్రతిజ్ఞ చేయించి, హార్ట్ఫుల్నెస్ వారి వ్యాసరచన పోటీలలో ప్రతీ విద్యార్థి పాల్గొనాలని పిలుపునిచ్చారు.

# జింద్‌లో రూ.14,700 కోట్ల అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించిన ప్రధాని నరేంద్ర మోదీ

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హరియాణాలోని జింద్‌లో సుమారు రూ. 14,700 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసి, జాతికి అంకితం చేశారు. ఈ కార్యక్రమం ద్వారా హరియాణా రాష్ట్ర అభివృద్ధి ప్రయాణానికి సరికొత్త ఊతం లభిస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

**దేశపు మొట్టమొదటి హైడ్రోజన్ రైలు ప్రారంభం**

జింద్ మరియు హరియాణా పేర్లు ఈరోజు చరిత్ర పుటలలో శాశ్వతంగా నిలిచిపోతాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. దేశంలోనే మొట్టమొదటి హైడ్రోజన్ రైలును జింద్–సోనిపట్ మార్గంలో ఆయన లాంఛనంగా ప్రారంభించారు. పూర్తిగా ఉద్గార రహితమైన ఈ రైలు, స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించబడిన మేక్ ఇన్ ఇండియా విజయానికి ఒక అద్భుతమైన నిదర్శనమని ఆయన కొనియాడారు. కేవలం పది బోగీలతో అత్యంత శక్తివంతమైన 3,200 హార్స్‌పవర్ సామర్థ్యంతో నడిచే ఈ రైలు, అంతర్జాతీయ స్థాయిలో భారతదేశ సత్తాను చాటుతోందని ప్రధాని స్పష్టం చేశారు. 19వ శతాబ్దం ఆవిరి యంత్రాలతో, 20వ శతాబ్దం విద్యుత్ శక్తితో నడిస్తే, 21వ శతాబ్దం ఈ అత్యాధునిక హైడ్రోజన్ ఆధారిత రవాణాతో నడుస్తుందని ఆయన అభివర్ణించారు.

**మౌలిక సదుపాయాలు మరియు ఆరోగ్య రంగానికి పెద్దపీట**

రవాణా మరియు వైద్య రంగాలను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని ప్రధాని తెలిపారు. భివానీలోని పండిట్ నేకీ రామ్ శర్మ మెడికల్ కాలేజీ, నార్నౌల్‌లోని మహర్షి చ్యవన్ మెడికల్ కాలేజీ మరియు రావ్ తులారాం ఆసుపత్రులను ఆయన జాతికి అంకితం చేశారు. వీటితో పాటు ఢిల్లీ–అమృత్‌సర్–కత్రా ఎక్స్‌ప్రెస్‌వే స్థానిక విభాగం, జింద్–




గోహానా జాతీయ రహదారి, అంబాలా–కాలా ఆంబ్ ఫోర్ లేన్ ప్రాజెక్టులను ప్రారంభించారు. ఐదు జాతీయ రహదారులతో అనుసంధానం కావడం ద్వారా రైతులు మరియు పశువుల పెంపకందారులకు వాణిజ్య మార్కెట్లకు సులభమైన ప్రవేశం లభిస్తుందని, ఇది ఉపాధి అవకాశాలను భారీగా పెంచుతుందని ఆయన వివరించారు. దేశంలో రైల్వే విద్యుదీకరణ 99 శాతానికి, హరియాణాలో 100 శాతానికి చేరుకోవడం వల్ల ప్రపంచ చమురు సంక్షోభం ఉన్నప్పటికీ మన రవాణా వ్యవస్థకు ఎలాంటి అంతరాయం కలగలేదని గుర్తు చేశారు.

**క్రీడలు, వ్యవసాయం మరియు సాంస్కృతిక వారసత్వం**

యువత మరియు క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని పునరుద్ఘాటించారు. నూతన జాతీయ క్రీడా విధానం, ఖేలో భారత్, టాప్స్ వంటి పథకాల ద్వారా అథ్లెట్లకు అపూర్వమైన మద్దతు లభిస్తోందన్నారు. 2030 కామన్వెల్త్ గేమ్స్ మరియు 2036 ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇవ్వడానికి భారతదేశం సన్నద్ధమవుతున్న వేళ, క్రీడాకారులు తమ సాధనను తీవ్రతరం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. రైతుల సంక్షేమం గురించి మాట్లాడుతూ, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా రాష్ట్ర రైతులకు సుమారు రూ. 8,000 కోట్లు అందించామని, అందులో జింద్ ప్రాంత రైతులకే రూ. 600 కోట్లు బదిలీ చేశామని వెల్లడించారు. అలాగే, భారతదేశ గొప్ప గురు పరంపరను మరియు సిక్కుల చరిత్రను భావితరాలకు సగర్వంగా అందించే లక్ష్యంతో కురుక్షేత్రలో నూతన సిక్కు మ్యూజియానికి ప్రధాని శంకుస్థాపన చేశారు. వ్యవసాయం, పరిశ్రమలు అనే రెండు బలమైన చక్రాలపై హరియాణా సాధిస్తున్న ఈ శరవేగ అభివృద్ధి, నవభారత నిర్మాణానికి ఎంతో శక్తినిస్తుందని ప్రధాని మోదీ తన ప్రసంగాన్ని ముగించారు.

# దేవాదాయ శాఖ చరిత్రలో సువర్ణాధ్యాయం

### 191 మందికి నియామక పత్రాలు అందజేసిన మంత్రి కొండా సురేఖ



హైదరాబాద్‌లోని రవీంద్రభారతి వేదికగా తెలంగాణ దేవాదాయ శాఖ చరిత్రలో నూతన శకానికి నాంది పలికారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి నేటి ప్రత్యేక తెలంగాణ వరకు ఎన్నడూ లేని విధంగా, దేవాదాయ శాఖ పరిధిలోని దేవాలయాల్లో 191 మంది మతపరమైన ఉద్యోగులకు ఒకేసారి నియామక ఉత్తర్వులు జారీ చేయడం ఒక చారిత్రక ఘట్టంగా నిలిచింది. రాష్ట్ర వ్యాప్తంగా 47 ఆలయాలకు ఎంపికైన పురోహితులు, పరిచారకులు, వేదపండితులు, అసిస్టెంట్ కుక్‌లు, అలాగే డోలు, సన్నాయి, మృదంగం వంటి వాయిద్య కళాకారులకు దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ స్వయంగా నియామక పత్రాలను అందజేశారు. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న కల సాకారం కావడంతో దేవుని సన్నిధిలో పనిచేసే అవకాశం దక్కిన పలువురు ఉద్యోగులు ఉద్వేగానికి గురయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ పనితీరుకు ఈ నియామకాలే నిదర్శనమని మంత్రి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. దేవాలయ సేవను కేవలం ఉపాధిగానో, ఉద్యోగంగానో భావించ కూడదని, అది భగవంతుడికి సేవ చేసే పవిత్రమైన బాధ్యత అని మంత్రి కొండా సురేఖ దిశానిర్దేశం చేశారు. భక్తసేవే భగవత్సేవ అనే భావనతో భక్తులకు మరింత నాణ్యమైన సేవలు అందించడమే ఉద్యోగుల లక్ష్యం కావాలని ఆమె పిలుపునిచ్చారు. దేవాలయాలు భారతీయ సంస్కృతికి, సంప్రదాయాలకు, ధర్మ పరిరక్షణకు కేంద్రాలని, వాటి వైభవాన్ని పరిరక్షించే బాధ్యత ఈ సిబ్బందిపైనే ఉందన్నారు. నిరంతరం దేవుని సేవలో తరించే అర్చకులు, ఇతర సిబ్బంది సంక్షేమం కోసం 'అర్చకులు ఇతర ఉద్యోగుల సంక్షేమ నిధి ట్రస్ట్' ద్వారా ప్రయోజనాలను భారీగా పెంచినట్లు ఆమె గుర్తుచేశారు. దేవాదాయ శాఖ చరిత్రలో నిలిచిపోయే ఇలాంటి గొప్ప కార్యక్రమాలు తన హయాంలో జరగడం దైవానుగ్రహంగా భావిస్తున్నానని మంత్రి పేర్కొన్నారు. దేవాదాయ శాఖను మరింత బలోపేతం చేసే దిశగా పలు కీలక నిర్ణయాలను మంత్రి ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రధాన దేవాలయాల్లో ప్రత్యేక సందర్భాల్లో ఆధ్యాత్మిక, ధార్మిక, పురాణ ప్రవచనాల నిర్వహణకు త్వరలోనే ఉత్తర్వులు జారీ చేస్తామన్నారు. అలాగే, భవిష్యత్తులో ఉద్యోగుల పనితీరును బట్టి అవార్డులు అందజేస్తామని తెలిపారు. మరోవైపు, ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, సమృద్ధిగా వర్షాలు కురవాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని దేవాలయాల్లో వరుణయాగాలు నిర్వహించనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, డైరెక్టర్ హనుమంతరావు, ధార్మిక సలహాదారు గోవింద హరి తదితర ఉన్నతాధికారులు, పాల్గొన్నారు.

# రాష్ట్రవ్యాప్తంగా రవాణా శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ మరింత కట్టుదిట్టం: మంత్రి పొన్నం

### నిబంధనలు ఉల్లంఘించే వాహనాలపై కఠిన చర్యలు



రాష్ట్ర వ్యాప్తంగా రవాణా శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యకలాపాలను మరింత విస్తృతంగా చేపట్టి, నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని రవాణా కమిషనర్ కార్యాలయంలో రవాణా శాఖ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ఓవర్‌లోడింగ్ చేస్తున్న వాహనాలు, త్రైమాసిక పన్నులు చెల్లించనివి, ఫిట్‌నెస్ లేని వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించి రాష్ట్రవ్యాప్తంగా విస్తృత తనిఖీలు చేపట్టాలని సూచించారు. నిబంధనలను ఉల్లంఘిస్తున్న వాహనాలను ఏమాత్రం ఉపేక్షించవద్దని, అవసరమైతే వాటిని సీజ్ చేయాలని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా త్రైమాసిక పన్నులు చెల్లించని వాహన యజమానులపై భారీ జరిమానాలు విధించడంతో పాటు ఆ వాహనాలను సీజ్ చేయాలని మంత్రి ఆదేశించారు. ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని స్లీపర్ బస్సుల్లో నిబంధనల ఉల్లంఘనలపై ఉక్కుపాదం మోపాలని, ఉల్లంఘనలు గుర్తించిన వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. చెక్‌పోస్టులను రద్దు చేసిన సమయంలో ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను బలోపేతం చేస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయాన్ని మంత్రి ఈ సందర్భంగా గుర్తుచేశారు. దానికి అనుగుణంగా ప్రస్తుతం అందుబాటులో ఉన్న సిబ్బందిని మరింత సమర్థవంతంగా వినియోగించుకుంటూ తనిఖీలను ముమ్మరం చేయాలని సూచించారు. అలాగే జూన్ 8 నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేసిన మొబైల్ స్క్వాడ్‌ల పనితీరును సైతం ఆయన సమీక్షించారు.

ఈ సమీక్షా సమావేశంలో స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి, అడిషనల్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ రమేష్, జేటీసీలు చంద్రశేఖర్ గౌడ్, శివ లింగయ్య, డీటీసీలు రవీందర్ కుమార్, వెంకట రమణ, సురేష్ రెడ్డి, ప్రమీల, వాణి, సదానందం, ఆఫ్రిన్, ఓఎస్డీ సైదులు తదితరులు పాల్గొన్నారు.

PRGI NO: TGTEL/25/A5514
7
హైదరాబాద్
శనివారం,
18 జులై 2026
అర్జున్ సమాచారం
www.arjunsamaachaaram.in
తెలుగు దినపత్రిక
సినిమా
CINEMA




# ఓటీటీలోకి వచ్చేసిన ‘మా ఇంటి బంగారం’..

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు ప్రధాన పాత్రలో నటించి, నిర్మించిన సూపర్‌హిట్ యాక్షన్ ఫ్యామిలీ డ్రామా ‘మా ఇంటి బంగారం’ ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. థియేటర్లలో భారీ విజయాన్ని నమోదు చేసి రూ.100 కోట్ల క్లబ్‌లో చోటు దక్కించుకున్న ఈ చిత్రం, తాజాగా ప్రముఖ ఓటీటీ వేదిక జియో హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ అవుతుంది. జూన్ 19న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ‘మా ఇంటి బంగారం’ కేవలం 28 రోజులకే డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లోకి రావడం విశేషం. సాధారణంగా భారీ బడ్జెట్ స్టార్ హీరోల సినిమాలకే త్వరగా ఓటీటీ రిలీజ్ లభించే పరిస్థితుల్లో, మహిళా ప్రధాన కథాంశంతో తెరకెక్కిన ఈ చిత్రం అదే స్థాయిలో ప్రేక్షకాదరణ పొందడం ప్రత్యేకంగా చెప్పుకోవాలి. దర్శకురాలు నందిని రెడ్డి తెరకెక్కించిన ఈ చిత్రానికి రాజ్ నిడిమోరు స్క్రీన్‌ప్లే అందించారు. భావోద్వేగాలు, యాక్షన్, ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్‌ను సమపాళ్లలో మేళవించిన ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ.100 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసి మహిళా ప్రధాన తెలుగు చిత్రాల్లో కొత్త రికార్డు సృష్టించింది. ఈ చిత్రంలో సమంత ‘స్వర్ణ’ పాత్రలో కనిపించింది. పెళ్లి తర్వాత తొలిసారి భర్త ఇంటికి వెళ్లిన ఓ యువతి, కొత్త కుటుంబంలో కలిసిపోవడానికి ప్రయత్నించే సమయంలో ఊహించని పరిణామాలు ఎదురవుతాయి. గత జీవితానికి సంబంధించిన ఓ రహస్యం ఆమె జీవితాన్ని మలుపుతిప్పుతుంది. కుటుంబాన్ని కాపాడుకోవడానికి స్వర్ణ చేసిన పోరాటమే సినిమా ప్రధాన కథ.



# కథలోని భావోద్వేగాలు కదిలిస్తాయి

రుత్విక్, విశాఖ ధిమాన్ జంటగా నటించిన పీరియాడిక్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ ‘రాజా ది రాజా’ చిత్రం నేడు ప్రేక్షకుల ముందుకొస్తున్నది. అనిల్ బోయిడపు దర్శకత్వంలో బృందావన్ క్రియేషన్స్ పతాకంపై కె.నిహారిక దాసరి నిర్మించారు. మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ విడుదల చేస్తున్నది. గురువారం ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. హీరో కావాలనే తన కల ఈ సినిమాతో నెరవేరిందని, టీమ్ అంతా పాషన్‌తో సినిమా చేశామని, ప్రీమియర్స్‌కు వచ్చిన స్పందన విజయంపై నమ్మకాన్ని పెంచిందని హీరో రుత్విక్ అన్నారు. వినూత్నమైన కథతో సినిమా తీశామని, ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినందిస్తుందని నిర్మాత కె.నిహారిక దాసరి తెలిపింది. కథలోని భావోద్వేగాలు ప్రేక్షకుల్ని కదిలిస్తాయని దర్శకుడు అనిల్ బోయిడపు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర సంగీత దర్శకుడు మార్క్ కె రాబిన్‌తో పాటు చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

# అజిత్ సినిమాలో కీలక పాత్ర?

అనతికాలంలోనే తారపథంలో దూసుకుపోతున్నది అస్సామీ సోయగం కయాదు లోహర్. డ్రాగన్, ఫంకీ చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన ఈ భామ ప్రస్తుతం ‘ది ప్యారడైజ్’లో నాని సరసన కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. తాజా సమాచారం ప్రకారం ఆమె తమిళంలో మరో బంపరాఫర్‌ను దక్కించుకున్నట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే.. అగ్ర హీరో అజిత్ 64వ సినిమా కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీనికి అధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహిస్తారు. ప్రస్తుతం ఈ సినిమా ప్రీప్రొడక్షన్ దశలో ఉంది. ఈ సినిమాలోని ఓ కీలక పాత్రలో కయాదు లోహర్ నటించనున్నట్లు తెలిసింది. కథాగమనంలో ఆమె పాత్రకు చాలా ప్రాధాన్యత ఉంటుందని చెబుతున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో వెలువడనుంది. ఇదిలావుండగా సూర్య 48వ చిత్రంలో కూడా కయాదులోహర్ నాయికగా నటిస్తున్నది.





# యువత మెచ్చే ‘హుషార్ పిట్టలు’

అన్షు, వాసవి గణేషన్ జంటగా రూపొందుతున్న చిత్రం ‘హుషార్ పిట్టలు’. బిక్షు దర్శకుడు. రుద్రక్రాంతి పిక్చర్స్ పతాకంపై వెంకట్ యాదవ్ నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తయింది. ఆగస్ట్ 15న ఏషియన్, సురేష్ ఫిలింస్ ద్వారా థియేట్రికల్ రిలీజ్ కానుంది. బుధవారం ఈ సినిమా నుంచి ‘టోంగా టోంగా’ అనే గీతాన్ని విడుదల చేశారు. చరణ్ అర్జున్ స్వరపరిచిన ఈ గీతాన్ని మంగ్లీ ఆలపించారు. యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ ఇదని, తెలుగులో ట్రెండ్ సృష్టిస్తుందనే నమ్మకం ఉందని దర్శకుడు బిక్షు పేర్కొన్నారు. టీజర్ సోషల్‌మీడియాలో వైరల్ అయిందని, కొంతమంది ట్రోల్ చేశారని, అయితే సినిమా రిలీజ్ అయిన తర్వాత అసలు కథేమిటో అందరికీ తెలుస్తుందని, హృదయాలకు హత్తుకునే చిత్రమిదని నిర్మాత వెంకట్ యాదవ్ తెలిపారు. టీజర్‌ను కొందరు తప్పుగా అర్థం చేసుకున్నారని, సినిమా చూసిన తర్వాత వారి ఆలోచన మారిపోతుందని హీరో అన్షు అన్నారు.



# మోస్ట్ వాంటెడ్ ‘ఫౌజీ’

ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న పీరియాడిక్ చిత్రం ‘ఫౌజీ’ విడుదల తేదీ ఖరారైంది. ఈ సినిమాను డిసెంబర్ 3న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు గురువారం మేకర్స్ ప్రకటించారు. హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ పీరియాడిక్ డ్రామాలో ప్రభాస్ సైనికుడి పాత్రలో కనిపించనున్నారు. 1940 దశకం నాటి స్వాతంత్ర్య సంగ్రామం, రెండో ప్రపంచయుద్ధం తాలూకు సంఘటనల నేపథ్యంలో అల్లుకున్న కల్పిత కథ ఇదని సమాచారం. రిలీజ్ డేట్ పోస్టర్‌లో ప్రభాస్ కదనరంగంలో క్షతగాత్రుడై రక్తమోడుతున్న దుస్తుల్లో కనిపిస్తున్నారు. బందూక్ చేపట్టి దీర్ఘాలోచనలో ఉన్న ఆయన లుక్ సినిమాలోని భావోద్వేగాల్ని ప్రతిఫలిస్తున్నది. ఓ యోధుడి త్యాగం, ధీరత్వానికి ప్రతీకలా ఈ లుక్ కనిపిస్తున్నది. ‘1932 నుంచి మోస్ట్ వాంటెడ్ జాబితాలో ఉన్నాడు’ అని రాసి ఉన్న స్టాంప్ కూడా కథపై ఆసక్తిని రేకెత్తిస్తున్నది. భారీ స్థాయిలో యాక్షన్ ఘట్టాలతో పాటు బలమైన భావోద్వేగాలతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని మేకర్స్ తెలిపారు. ఇమాన్వి, మిథున్‌చక్రవర్తి, అనుపమ్‌ఖేర్, జయప్రద, భానుచందర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: విశాల్‌చంద్రశేఖర్, నిర్మాణం: మైత్రీ మూవీ మేకర్స్, నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, భూషణ్ కుమార్, రచన–దర్శకత్వం: హను రాఘవపూడి.



## కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిన కేసులపై చెన్నూరు న్యాయస్థానానికి బీఆర్ఎస్ నాయకుల హాజరు.

### హామీలు అమలు చేయాలని ప్రశ్నించినందుకే కేసులు నమోదు చేశారని ఆరోపణ!



**అర్జున్ సమాచారం జులై 17 మంచిర్యాల ప్రతినిధి:**

చెన్నూరు:కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రశ్నించినందుకే తమపై అకారణంగా కేసులు నమోదు చేసి న్యాయస్థానాల చుట్టూ తిప్పుతున్నారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ఆ కేసుల విచారణలో భాగంగా కోటపల్లి మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం చెన్నూరు న్యాయస్థానానికి హాజరయ్యారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రశ్నించే గొంతులను అణచివేసే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కును కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ న్యాయ విభాగం సీనియర్ న్యాయవాది పొన్నం మల్లేశం గౌడ్, కోటపల్లి మండల నాయకులు ఎరినాగుల ఓదెలు, సాంబ గౌడ్, మారిశెట్టి విద్యాసాగర్, కొట్టె నారాయణ, ధనంజయ్, కల్వకుంట్ల తిరుపతిరావు, ఆసంపెల్లి సంపత్ కుమార్, తాళ్లపెల్లి బాపు, గుగులోత్ బాపు నాయక్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## గోదావరి పుష్కరాలకు ముందస్తు ఏర్పాట్లు వేగవంతం.

### వేలాల పుష్కర ఘాట్‌ను పరిశీలించిన గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులు!



**అర్జున్ సమాచారం జులై 17 మంచిర్యాల ప్రతినిధి:**

వేలాల:రానున్న 2027 గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని వేలాల గ్రామంలోని పుష్కర ఘాట్ వద్ద చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులు శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఇటీవల బాధ్యతలు స్వీకరించిన గ్రామీణ నీటి సరఫరా శాఖ విభాగాధికారి కిరణ్, సహాయ ఇంజినీరు రాజ్‌కుమార్ గ్రామాన్ని సందర్శించి పుష్కర ఘాట్ వద్ద అవసరమైన సౌకర్యాలపై సమగ్రంగా పరిశీలించారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు తాగునీరు, పారిశుద్ధ్యం, ఇతర మౌలిక వసతులు మెరుగ్గా ఉండేలా చేపట్టాల్సిన పనులపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి తగిన సూచనలు చేశారు.పుష్కరాల నాటికి అన్ని పనులు నాణ్యతతో పూర్తి చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులు సూచించారు.ఈ పరిశీలనలో గ్రామ సర్పంచ్ డేగ స్వప్న--నగేష్, గ్రామ కార్యదర్శి రాకేష్, మల్లేష్, శ్రీనివాస్, పాల్గొన్నారు.

## కాలనీ సమస్యలకు తక్షణ పరిష్కారం.. ప్రమాదాల నివారణకు చర్యలు.

### ఇందారంలో వర్షపు నీటి పారుదల ఏర్పాటు.. పాఠశాలల వద్ద వేగనిరోధకాలు!

**అర్జున్ సమాచారం జులై 17 మంచిర్యాల ప్రతినిధి:**

జైపూర్:ఇందారం ఎస్సీ కాలనీలో వర్షాకాలంలో ఇండ్ల ముందు వర్షపు నీరు నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనే సమాచారం అందడంతో గ్రామ సర్పంచ్ మహమ్మద్ ఫయాజ్, ఉపసర్పంచ్ ఎల్కటూరి శివ వెంటనే స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు.భారీ యంత్రం సహాయంతో రహదారిని తవ్వించి నీరు సాఫీగా వెళ్లేలా ఇనుప గొట్టాలను ఏర్పాటు చేయించారు. దీంతో కాలనీలో మురుగు, వర్షపు నీరు నిలిచే సమస్యకు పరిష్కారం లభించనుంది.అదే సమయంలో సమీపంలోని రెండు ప్రైవేటు పాఠశాలల వద్ద విద్యార్థుల రాకపోకల సమయంలో వాహనాల వేగం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశం ఉండటంతో వేగనిరోధకాలను ఏర్పాటు చేయించారు. ఈ చర్యతో విద్యార్థుల భద్రతకు మరింత భరోసా కలిగిందని తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.సమస్యలను వెంటనే పరిష్కరించిన సర్పంచ్ మహమ్మద్ ఫయాజ్, ఉపసర్పంచ్ ఎల్కటూరి శివ, గ్రామ కార్యదర్శి ప్రశాంత్, కారోబార్ బషీర్, పారిశుద్ధ్య సిబ్బందికి కాలనీ వాసులు, ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు మాడుగుల శంకర్, యువ నాయకుడు చిప్పకుర్తి సతీష్ పాల్గొన్నారు.



# మంచిర్యాలలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ప్రధాన కూడళ్ల పరిశీలన

### రోడ్డు ప్రమాదాల తగ్గింపే లక్ష్యమని డీసీపీ ఎ. భాస్కర్ వెల్లడి

**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జులై 17:**





రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు మంచిర్యాల పట్టణంలోని ఐబీ చౌరస్తా, బెల్లంపల్లి చౌరస్తా, లక్ష్మీ థియేటర్ చౌరస్తా తదితర ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటు, రోడ్డు ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలను మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్ పరిశీలించారు.ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ, కార్పొరేషన్‌గా అభివృద్ధి చెందిన మంచిర్యాల నగరంలో ట్రాఫిక్ నియంత్రణ, రహదారి క్రమశిక్షణ నగరాభివృద్ధికి అత్యంత కీలకమని అన్నారు. ప్రధాన రహదారుల ద్వారా వివిధ జిల్లాలు, రాష్ట్రాలకు రాకపోకలు సాగుతుండటంతో ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ రద్దీ పెరుగుతోందని తెలిపారు.హైదరాబాద్ ట్రాఫిక్ ఇంజినీరింగ్ నిపుణులతో అధ్యయనం నిర్వహించిన అనంతరం, స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో తొలి విడతలో నాలుగు ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. సిగ్నల్ వ్యవస్థ సమర్థవంతంగా పనిచేసేలా ఫ్రీ లెఫ్ట్‌లు, బొల్లార్డులు, స్టాప్ లైన్లు ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన చోట్ల ప్యాచ్‌వర్క్‌లు, యూ-టర్న్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.మంచిర్యాలలో కొన్ని కూడళ్లు ఐదు, ఆరు రహదారులు కలిసే ప్రాంతాలుగా ఉండటంతో ప్రత్యేక ప్రణాళికతో ట్రాఫిక్ నిర్వహణ చేపడుతున్నామని పేర్కొన్నారు. ట్రాఫిక్ వ్యవస్థను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన మార్పులు, మెరుగుదలలు చేపడతామని తెలిపారు.ప్రజలు ట్రాఫిక్ సిగ్నల్స్, రహదారి నియమాలను తప్పనిసరిగా పాటించాలని, నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని డీసీపీ హెచ్చరించారు. ఈ పరిశీలనలో మంచిర్యాల ఏసీపీ ఆర్. ప్రకాశ్, టౌన్ ఇన్‌స్పెక్టర్ ప్రమోద్ రావు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ హసన్, మేయర్ ధరణి మధు, డిప్యూటీ మేయర్ సల్ల రమ్యతో పాటు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

## మంథని మట్టితో వీడని బంధం

### గానకోకిల ఎస్. జానకితో ఆప్యాయ అనుబంధం.. మహావాది మాధురి ఉమాదేవి మృతితో విషాదం

**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జులై 17:**



మంథని స్వస్థలంగా, అనంతరం నాగ్‌పూర్‌లో స్థిరపడిన మహావాది మాధురి ఉమాదేవి గుల్కోట్‌వార్ ఆకస్మిక మరణం కుటుంబ సభ్యులతో పాటు మంథని ప్రాంత ప్రజలను తీవ్ర విషాదంలో ముంచింది. ఇటీవల పూణేలో గుండెపోటుతో ఆమె కన్నుమూయగా, ఈ వార్త బంధుమిత్రులు, ఆత్మీయులను దిగ్భ్రాంతికి గురిచేసింది.

**గానకోకిల ఎస్. జానకితో ప్రత్యేక అనుబంధం**

సంగీతంపై అపారమైన అభిరుచి కలిగిన మాధురి ఉమాదేవికి ప్రముఖ నేపథ్య గాయని ఎస్. జానకితో సుదీర్ఘకాలంగా ఆప్యాయ అనుబంధం ఉండేదని కుటుంబ సభ్యులు తెలిపారు. సంగీతం పట్ల ఉన్న అభిరుచి వీరిద్దరినీ మరింత దగ్గర చేసిందని వారు గుర్తుచేసుకున్నారు.అయితే, మాధురి ఉమాదేవి, ఎస్. జానకి ఒకే రోజు మరణించారనే అంశాన్ని కుటుంబ సభ్యులు భావోద్వేగంతో ప్రస్తావిస్తున్నారు. ఈ యాదృచ్ఛికం తమను మరింత కలచివేసిందని వారు పేర్కొన్నారు.

**మంథని మట్టితో విడదీయరాని అనుబంధం**

వివాహానంతరం భర్త మధుకర్ గుల్కోట్‌వార్ ఉద్యోగరీత్యా నాగ్‌పూర్‌లో స్థిరపడినా, మంథని పట్ల మాధురి ఉమాదేవికి ఉన్న అనుబంధం ఏమాత్రం తగ్గలేదు. ఊరి ప్రజలు, బంధువులతో ఎప్పటికప్పుడు సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తూ, కుటుంబ వేడుకలకు వీలైనప్పుడల్లా హాజరవుతూ ఉండేవారు.మంథనిలోని ఆమె సోదరులు సుధీర్, సతీష్, అలాగే సోదరీమణులు రమాదేవి, వాణిశ్రీలతో ఆమెకు ఎంతో ఆత్మీయ అనుబంధం ఉండేది. కుటుంబ సభ్యుల కష్టసుఖాల్లో అండగా నిలుస్తూ అందరి అభిమానాన్ని సంపాదించుకున్నారు.

**శోకసంద్రంలో కుటుంబ సభ్యులు**

విదేశాల్లో నివసిస్తున్న ఆమె పిల్లలు రజని, స్మిత, రవి తల్లి మృతివార్తతో తీవ్ర విషాదంలో మునిగిపోయారు. “అక్క లేని లోటు జీవితాంతం తీరదు” అంటూ సోదరులు, సోదరీమణులు కన్నీరుమున్నీరవుతున్నారు.మాధురి ఉమాదేవి జ్ఞాపకార్థం నిర్వహించనున్న ద్వాదశ దినకర్మ కార్యక్రమానికి మంథనితో పాటు వివిధ ప్రాంతాల నుంచి బంధుమిత్రులు, ఆత్మీయులు పెద్ద సంఖ్యలో హాజరై నివాళులర్పించనున్నారు.

# తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలన్నీ వెంటనే అమలు చేయాలి

### కేకే కమిటీకి మంథని ఉద్యమకారుల వినతి

**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జులై 17:**

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులకు ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మంథనిలోని డివిజన్ మీడియా ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు ఈ మేరకు కోరారు.హైదరాబాద్‌లో తెలంగాణ అమరుల జ్యోతి కార్యాలయంలో కేకే కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి కరీంనగర్, మంచిర్యాల జిల్లాల తెలంగాణ ఉద్యమకారుల సంప్రదింపుల సమావేశంలో మంథని ప్రాంతానికి చెందిన ఉద్యమకారులు పాల్గొని తమ అభిప్రాయాలు, సూచనలను కమిటీ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి, కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన సంక్షేమ హామీలను ఆలస్యం లేకుండా అమలు చేయాలని వారు కోరారు. ప్రతి ఉద్యమకారుడికి 250 గజాల ఇంటి స్థలం, నెలకు రూ.25 వేల గౌరవ పెన్షన్, ఉచిత బస్ పాస్, రూ.1000 కోట్ల నిధులతో తెలంగాణ ఉద్యమకారుల కార్పొరేషన్ ఏర్పాటు, ఉచిత వైద్యం, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాల్లో 20 శాతం రిజర్వేషన్, ఉద్యమకారుల పిల్లలకు ఉచిత విద్య వంటి హామీలను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.ఉద్యమకారులకు శాశ్వత సామాజిక భద్రత కల్పించేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని, కేకే కమిటీ సిఫార్సుల మేరకు హామీల అమలుపై త్వరితగతిన నిర్ణయాలు తీసుకోవాలని కోరారు.ఈ సమావేశంలో కేకే కమిటీ సభ్యులు కే. కేశవరావు, ప్రొఫెసర్ కోదండరాం, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, అద్దంకి దయాకర్, రాములు నాయక్, మోతె శోభన్ రెడ్డి పాల్గొన్నారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ ఆదేశాల మేరకు మంథని ప్రాంతానికి చెందిన ఉద్యమకారులు కమిటీకి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎక్కేటి అనంతరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వేల్పుల గట్టయ్య, దేవళ్ల విజయ్ కుమార్, కంకణాల తిరుపతిరెడ్డి, మట్ట రాజయ్య, పంతకాని రవి, పోరెడ్డి వెంకటరెడ్డి, వంశీతో పాటు పలువురు తెలంగాణ ఉద్యమకారులు పాల్గొన్నారు.



Printed, Published and Owned by LINGAM RAJAIAH, and Printed at Vijaya Lakshmi Printing Press , H.No.12-180, Gouthaminagar,Mancheria, Mancherial Telangana-504208, and Published at H.No.12-180, Gouthami-nagar,Mancheria,Mancherial Telangana-504208. Editor: LINGAM RAJAIAH. PRGI. No. TGTEL/25/A5314, lingamrajaiahmncl@gmail.com,8121319896.